ఆగస్టు 2010

# స్పందన

ఆధ్యాత్మిక మాసపత్రిక



## ఆయన తన రెక్కలతో నిన్ను కప్పును.

కీర్తన 91:4



## దేశమా, దేశమా, దేశమా, యెహోవా మాట వినుము.

యిర్మీయా 22:29

# వార్తలు - వ్యాఖ్యలు

## విద్య

మన భారత దేశంలో బాల, బాలికలకు సరైన చదువు అబ్బటంలేదు. ప్రాథమిక విద్యారంగంలో అయోమయం అలుముకుంటున్నది. ఉపాధ్యాయులు ఉత్తమ పౌరులను తయారు చేయలేకపోతున్నారు. ఒక జాతి యొక్క సంస్కృతి కాని, సభ్యత కాని ప్రాథమిక బడి గదిలోనే పరిరక్షింప బడుతుంది. ఈ మధ్య కలకత్తాలో ఒక ప్రాథమిక బడిలో ఒక అబ్బాయిని హెడ్‌మాస్టర్ గారు కొట్టాడు. అతడు కొన్ని రోజుల తరువాత ఆత్మహత్య చేసుకొన్నాడు. పిల్లలకు ప్రాథమిక దశలో చదువు చెప్పే ఉపాధ్యాయులకు మేధోక్షాళన చేయాలి. ఆ మధ్య తమిళనాడులో 14 యేళ్ళ బాలిక, గర్భిణి అయింది. బాత్‌రూమ్‌లో బిడ్డని కని పారేసి పారిపోయింది. ఇది ఎలా జరిగింది? స్కూల్ అంటే ఊరికే చదువు చెప్పడం, పరీక్షలు పాస్ చేయించడం కాదు చిన్న బిడ్డలకు ఆధ్యాత్మిక విలువలు నేర్పవలసిన పరిధి. ప్రాథమిక విద్యావిధానం పాడైపోయింది కాబట్టే ఉన్నత విద్య, ఇంకా పై చదువులు ఆత్మహత్యలకు, నేరాలకు దారి తీస్తున్నాయి. విద్యార్థులను జాగ్రత్తగా చూడాలి. వారి నైతిక ఆధ్యాత్మిక శీలాన్ని పెంపొందించాలి. వారి మానసిక అవసరాలకు మనం స్పందించాలి. విద్యార్థికి, ఉపాధ్యాయునికి మధ్య సరైన సంబంధాలు నెలకొనాలి. ఈ విషయంలో క్రైస్తవ సంఘం తన బాధ్యతను గుర్తెరగాలి. విద్యకు కూడ "నేనే మార్గమును" అన్నాడు యేసుక్రీస్తు. విద్యా బోధన వ్యాపారం కాకూడదు. ఇన్ని శతాబ్దాలు సువార్త సేవ చేస్తున్న సంఘం. దీనికి జవాబు చెప్పాలి. 2 దిన 7:14 పెద్ద అక్షరాలతో గుండె మీద రాసుకోవాలి. యేసుప్రభువు చిన్న పిల్లలను ఎంతో ప్రేమించి ఆదరించి. తన వద్దకు పిలుచుకున్నాడు. కానీ నేటి క్రైస్తవ సువార్త – క్రైస్తవులకు మాత్రమే అన్నట్లు ధ్వనిస్తోంది. క్రైస్తవ వైఖరిలో ఉజ్జీవం రావాలి! యేసూ, మా జాతిని రక్షించు! కాపాడు! నీవే మా సమస్యలకు పరిష్కారం. అమేన్.

★★★

## మన దేశం

మన భారతదేశంలో ధనికులకు నిరుపేదలకు మధ్య దూరం రాను రాను ఎక్కువవుతున్నది. యువకులు అధిక సంఖ్యలో నిరుద్యోగులు అవుతున్నారు. 30 శాతం ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువ, చావలేక బ్రతుకుతున్నారు. 20 శాతం ప్రజలకు తాగడానికి మంచినీళ్ళు దొరకవు. 40 శాతం జనాభా నిరక్షరాసులు. దేశంలో ప్రభుత్వ శాఖలన్నింటిలో లంచగొండితనం, ఆశ్రుత పక్షపాతం ఎక్కువవుతున్నాయి. చివరికి న్యాయశాఖలో కూడా అన్యాయం జరుగుతున్నది.

క్రైస్తవ విశ్వాసులు మనదేశం కోసం కన్నీటి ప్రార్థన చేయాలి. జాతీయ పాపాలను గుర్తించి ఖండించాలి. మన దేశానికి సంఘం, ప్రవక్త పాత్ర పోషించాలి. దేశంలో శాంతి నెలకొనాలి. ఆధ్యాత్మిక విలువలను సంఘం ఎత్తి చూపాలి. దేవుని కృప నిరర్థకం కాకూడదు. సంఘాలలో చీలికలు రావడం పరిపాటి అయిపోయింది, సమాధానం కరువైపోతోంది. యేసు మా భారత జాతిని కాపాడు, జాతీయ ఉజ్జీవం ప్రసాదించు. ఆమేన్.

1976 - 2010 34 సంవత్సరాలుగా దేవుని అపార కృపలో

# స్పందన

ఆధ్యాత్మిక మాస పత్రిక

*The largest circulated Telugu Christian monthly since 34 years*

ఆగస్టు 2010 సంపుటి 34 సంచిక 8

వ్యవస్థాపక, ప్రధాన సంపాదకులు:
ఆచార్య ఆరార్కే మూర్తి

ప్రచురణకర్త, సంపాదకులు:
డా॥ దేవసహాయం దండల

సహకారం:
పాస్టర్ పి. సురేశ్ బాబు

సంపాదక వర్గం:
పాస్టర్ జి. దేవరాజు, బ్రదర్ కె. పరమానందం, బ్రదర్ ఎన్. దేవానంద్, బ్రదర్ ఆర్. ఎలూజై, శ్రీమతి ఎన్. లిల్లీ భాస్కర్

సహాయ సంపాదకులు:
బ్రదర్ డి. ఎఫ్రాయిం, బ్రదర్ డేవిడ్

## ఈ సంచికలో..

| | |
|---|---|
| తల్లిదండ్రులు | 6 |
| మన స్వాతంత్ర్యం | 8 |
| స్వాతంత్ర్య సత్యాలు | 10 |
| దాస్యవిమోచన | 12 |
| బ్లెస్సింగ్ ఉమెన్ | 14 |
| యేసుతో.. యేసులో.. | 16 |
| రాజైన యేసుక్రీస్తు | 18 |
| గద్దింపు | 22 |
| బైబిల్‌లోని పేర్లు | 24 |
| నిర్గమకాండము | 25 |
| ప్రకటన గ్రంథం | 28 |

మా అడ్రస్
**స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక**
51-4-12, ఇ.ఎస్.ఐ హాస్పటల్ రోడ్, గుణదల,
విజయవాడ - 520 004, ఫోన్ : 2456547,

E-mail: spandana1976@gmail.com

Founder & Chief Editor
ACHARYA R.R.K.MURTHY

Printed, Published and owned by
DEVASAHAYAM DANDALA
Printed at Spandana Offset Printers, Suryaraopet,
VJA-2. Ph:2430148, For Spandana Graphics &
Published from # 30-3-13,
Durga Agraharam, Vijayawada - 2.

### చందా వివరాలు

| | స్వదేశంలో | విదేశంలో |
|---|---|---|
| 1 సంవత్సరం | రూ. 150 | $20 |
| జీవిత సభ్యత్వం | రూ. 2000 | $200 |
| పోషక సభ్యత్వం | రూ. 150 (ప్రతినెల) | $20 |

### ప్రత్యేక మనవి

అందరికీ అందుబాటులో ఉండాలని సం. చందా రు.150 గానే ఉంచాము. వాస్తవానికి సుమారుగా రు.200/- ఖర్చవుతుంది. పరిచర్య అభివృద్ధి కోసం ప్రార్థించి, ప్రభువు మిమ్మును ప్రేరేపిస్తే మీ సేవా కానుకలు పంపాలని మనవి. కానుకలు పంపుచున్న చందాదారులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు, స్పందన పరిచర్య నిమిత్తం మీరు పంపే కానుకలు, చెక్కులు, డ్రాఫ్టులు, ఎం.ఓ.లు, స్పందన (SPANDANA) పేరు మీద మా అడ్రస్‌కు పంపాలి. మీ కానుక అందిన వెంటనే స్పందన ఆఫీసు నుండి ఉత్తరం రాస్తాము.

ఆన్‌లైన్ అకౌంట్ నం. 015810100016691
ఆంధ్రాబాంక్, గుణదల, విజయవాడ.




# స్పందన ప్రతిస్పందన



## ఉత్సాహం... ఆనందం...

ప్రభువు నందు ప్రియులు, స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక పరిచారకులకు నా హృదయపూర్వక కృతజ్ఞత అభివందనములు. అయ్యా బైబిలులోని అనేక విషయాలను ఆసక్తితో చదువుటకు, ఆత్మీయ ఆహారముగా 'స్పందన' ఎంతో మేలుగా ఉపయోగపడుచున్నది. గ.ను.క, మెదడుకు మేత ద్వారా చాలా ఉత్సాహాన్ని, ఆనందాన్ని పొందగలుగుచున్నాము. పరిచర్యచేయువారికందరికి వందనములు.

**జె.సరోజిని, రాజమండ్రి.**

## ఆకర్షణ

ప్రభువునందు ప్రియులైన ఆరార్కే గారికి, దేవసహాయం గారికి వందనాలు. ఈ మాసపు సంచికలోని వ్యాసాలు చదివి నేనెంతగానో బలపరచబడ్డాను. ముఖ్యంగా సువార్త, నిరీక్షణ బలం, నాయకుడు అనే వ్యాసాలు ఎంతగానో నన్ను ఆకట్టుకున్నాయి. మెదడుకు మేత, గ.ను.క వల్ల బైబిల్‌ను మరోకసారి చదవడమేగాక, ఎన్నో విషయాలు తెలుసుకోగలుగుతున్నాము. ప్రతి శనివారం ఆరాధనలో ప్రసారమయ్యే టి.వీ కార్యక్రమము మా కెంతో ఉపయోగకరంగా ఉంది. ఎన్నో మేలులు పొందుకుంటున్నాము.

**వి.జడ్సన్, అమీనాపురం.**

## ఆశీర్వాదాలు

సహో.దేవసహాయం గారికి వందనములు. నేను 'స్పందన' పత్రిక క్రమం తప్పక చదువుతాను. 'స్పందన' టి.వి ప్రసంగాలు వింటాను. ఆధ్యాత్మిక ఆశీర్వాదాలు పొందుకుంటున్నాను.

**ఆర్.రాజ్యలక్ష్మి, కంకిపాడు.**

## నిరీక్షణ

గౌరవనీయులైన దేవసహాయం అన్నయ్య గారికి మన ప్రభువైన క్రీస్తు నామములో ప్రేమపూర్వకమైన వందనములు. మీరు ప్రసారం చేస్తున్న స్పందన అనే ఆధ్యాత్మిక కార్యక్రమం 13-7-10న రాత్రి మా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళినపుడు టి.వీ లో చూశాను. మీరు ప్రకటించుచున్న వాక్యం ద్వారా నాతో మాట్లాడాడు. తద్వారా ఈ ఉత్తరం వ్రాయాలనిపించింది. దేవుడు గురించి మీరు "నీవు ఎంతైన నమ్మదగిన దేవుడవు" అని చెప్పారు. ఈ వాక్యం నా హృదయంలో నిరీక్షణ కలుగజేసింది. చాలా వందనాలు.

**యమ్.ఏడుకొండలు, గుంటూరు.**

## దీవెనలు...

ప్రభువు నందు సహో.దండల దేవసహాయం అన్నయ్యకు, ఆచార్య ఆరార్కే మూర్తి తాతయ్యకు మా హృదయపూర్వక వందనములు. అన్నయ్య టి.వీ.లో మీరు ప్రసారం చేస్తున్న స్పందన కార్యక్రమం చూస్తూ ఉంటాం. టి.వీలో మిమ్ములను, తాతయ్యను చూసినప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది. వాక్యాన్ని విని దీవెనలు పొందుతున్నాము.

**టి.రాజు, సైలా, అనంతపురం.**

## వాక్యం మాకు ఎంతో ఇష్టం

ప్రభువునందు దైవజనులకు నా హృదయ పూర్వక వందనములు. అయ్యగారు మీరు టి.వి లో, రేడియోలో చెప్పిన వాక్యం మాకు ఎంతో ఇష్టం, మీరు ఎక్కువగా నశించిపోయిన ఆత్మలకొరకు, రక్షణలేని వారి కొరకు ఎంతో భారంగా ప్రార్థిస్తున్నందుకు వందనములు. మేము ఎల్లప్పుడు మీరు చెప్పిన వాక్యానికి టైముకు వచ్చి ప్రార్థనలో కూర్చొని ఉంటాం.

**బి.వెంకట్రావు, నిడదవోలు.**

# సంపాదకీయం....

"సత్యమే మిమ్ములను స్వతంత్రులనుగా చేస్తుంది". అన్నాడు ప్రభువు. అసత్యం ద్వారా సత్యాన్ని గ్రహించలేము. అసత్యం నుండి దేవుడు సత్యానికి నడిపిస్తాడు. సత్యాన్ని కొనవచ్చుగాని అమ్మకూడదు అంటుంది బైబిలు. స్వతంత్రులు సత్యానికి చెందినవారు. అసలు నీవెవరో తెలుసుకో. సత్యంలో భిన్నత్వం ఉండదు. సత్యం ఎక్కడైనా సత్యమే! లోకంలో చాలామంది సత్యాన్ని అన్వేషిసున్నాము, అంటారు గాని ఖైదీ ఒక చెరసాల నుండి మరో చెరసాలకు మారటం లాంటిదే. పిలాతు సత్యమేమిటో? అంటున్నాడంటే సత్యమే అయి ఉన్న యేసు అతని ఎదురుగా నిలిచి ఉన్నాడనే జ్ఞానం అతనికి లేకపోయింది. ప్రేమ, కనికరం, సానుభూతి అవగాహన యేసునందు తప్పమరెక్కడా మనిషికి కానరావు. వేషధారణ అంటే కల్పనా భక్తి మానవ నిర్మితమైనది మానవ మార్గం. సత్యమార్గం. జీవమార్గం. క్రీస్తునందు మనకు ఒక కొత్త ఆధ్యాత్మిక సంస్కృతి లభించింది. సత్యానికి ప్రత్యామ్నాయమంటూ ఉండదు. ఏ మతానికైనా మానవ జీవితాన్ని మార్చే శక్తి లేదు. మతం వాదోపవాదాలకు పనికొస్తుంది అంతే. క్రైస్తవం అంటే పునరుత్థాన జీవితం. సిలువ వేత లేనిదే పునరుత్థానం లేదు. సిలువ మీద యేసు సాధించిన ఘనవిజయం. యేసు మృత్యుంజయుడని పునరుత్థానం ఎలుగెత్తి చాటుతోంది. సామాన్య మానవుడి చేత అసాధారణ కార్యాలు చేయించేది యేసు సందేశం. పరిశుద్ధాత్మ యుగమిది. యేసు జీవన విధానాన్ని మనలో అమలు పరిచే వాడు పరిశుద్ధాత్మ. మరోమాట. ధ్యానం, మానవ మనస్సుకూ మేధకు సంబంధించిన వ్యాసంగం కాదు. పరిశుద్ధాత్మ ధ్యానం యేసు మనస్సు ధ్యానంలో పనిచేస్తుంది. భక్తి అంటే వాక్యాన్ని తలంచటం, ధ్యానించటం, అభ్యసించటం వాక్యానుసారం కాని భక్తి ఒక భ్రమ మాత్రమే! ధ్యానం నీ జీవితానికి అర్ధం చెబుతుంది. చూపుతుంది. యేసు వ్యక్తిత్వానికి మనల్ని క్రమేణా మారుస్తుంది. భక్తి ధ్యానాత్మకమైనది. పాశ్చాత్య సంస్కృతికి ప్రభావితం కాకూడదు. ప్రతి విశ్వాసీ ఎవరికీ తోక కాకూడదు. నీవు తలవు! పరిశుద్ధాత్మ లేని వ్యాయామం మతం కావచ్చు. దానికి ఉద్యమ లక్షణం రాదు. నిత్యత్వపు విలువలను మనం పరిరక్షించుకోవాలి, దేవుని వాక్యప్రకారం, వాక్యప్రమాణం మేరకు జీవిస్తే అరుణోదయ దర్శనం కలుగుతుందని దేవుని వాగ్దానం!

క్రీస్తునందు భవదీయుడు - ఆరార్కె

# మనలో మాట....

క్రీస్తునందు ప్రియ పాఠకులకు

యేసు క్రీస్తు ప్రభువు దివ్యనామమున మీకు ఆగస్టు నెల శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ఆగస్టు మాసం అనగానే మనకు గుర్తొచ్చేది 'స్వాతంత్ర్య దినోత్సవము'. పరాయి పాలన నుండి భారతావనికి విముక్తి వచ్చిన రోజు. అనేక సార్లు మా పాఠకులకు నేను మనవి చేసినట్లు భౌతిక విషయాలను ఆధ్యాత్మికంగా మనం చూడగలిగినపుడే జీవితం అర్ధవంతమవుతుంది. మనం తీసుకునే ఆహారం - జీవాహారాన్ని జ్ఞాపకం చేసుకోవాలి. దాహం తీసుకునే ప్రతి సారి జీవజలాన్ని, బట్టలు ధరించుకునే ప్రతి సారి మహిమ వస్త్రాలను, మన గృహాలు - ప్రభువు మనం కోసం సిద్ధపరుస్తోన్న స్థలాన్ని, ఇంగ్లీషు బైబిలు ప్రకారం శ్రేష్టమయిన భవనాలు సిద్దం చేస్తున్నాడు మన ప్రభువు, ఇలా ప్రతి విషయాన్ని ఆధ్యాత్మీకరించుకుంటున్నాడు ఓ భక్తుడు. మీరు భయపడను అంటే మరో మాటకూడా చెబుతాను, ప్రతి రోజూ నిద్రపోయేటప్పుడు, ప్రభూ - *ఏదో ఓ రోజున నేను ఈ లోకంలోనుండి శాశ్వతంగా నిద్రపోతాను!!* అని పడుకునేటప్పుడు, ఉదయం లేవగానే, దేవా, ఒకానొక రోజు నిత్యరాజ్యంలో నేను కూడా ఇలా నిద్ర లేస్తాను, అని అన్వయించుకోవాలి.

ఏంటండీ, దేవసహాయం గారు ప్రతి రోజూ చావును జ్ఞాపకం చేసుకోవాలా? అని అడుగుతున్నారా? అలా చేసే విశ్వాసి చావాల్సిన సమయం వచ్చినపుడు 'సంతోషంగా' నిత్యరాజ్యం లోనికి అడుగుపెడతారు.

ఇంతకూ మీకు చెప్పాలని ప్రయత్నిస్తున్న విషయమేమంటే, మన దేశానికి స్వతంత్రం వచ్చినట్టే మీ ఆధ్యాత్మికంగా స్వతంత్రులయ్యారా? మీ పాపాలు పరిహరించబడి, ప్రభువైన యేసు రక్తములో మీరు శుద్ధిచేయబడి పవిత్రులయ్యారా? ప్రాముఖ్యమైన ప్రశ్న.

అలనాడు ఇశ్రాయేలు జాతి కఠిన దాసత్వంలో మగ్గిపోయింది. దేవుడు తన ప్రజలను కనికరించి అనేక అద్భుతాలు చేశాడు, చివరికి **'గొర్రెపిల్ల రక్తం'** ఎవరైతే ద్వారబంధాల మీద గుర్తుగా ఉంచుకున్నారో అద్భుతంగా రక్షింప పడ్డారు. ఆ దివ్యమైన రోజును జ్ఞాపకం చేసుకుంటూ దేవుని ప్రజలు పస్కాను అనే పండుగను ఆచరించారు.

ఈ రోజున యేసుక్రీస్తు ప్రభువు వారు సిలువలో కార్చిన ఆ ప్రశస్త రక్తములో విశ్వాస ముంచిన వారు రక్షింప బడతారు. నీతిమంతులుగా తీర్చబడతారు. **1 యోహాను 1.7 - యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను కడిగి పవిత్రులనుగా చేయును. 9వ. మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల.... మనలను పవిత్రులనుగా చేస్తాడు.** దేవునికి స్తోత్రాలు.

అయితే, దేవుని బిడ్డలమీద ప్రత్యేకమయిన బాధ్యతలున్నాయి. ప్రతి ప్రాంతంలోని దేవుని సంఘం ఆ ప్రాంతం, పట్టణం, నగరపు అవసరతలు తెలుసుకుని ప్రార్ధించేవారుగా ఉండాలి. ఓ సారి మేము కర్నాటకలో ఉండగా, 'ఈ రాష్ట్రానికి గవర్నరెవరు?' అని దైవజనులు ఆరార్కే గారు అక్కడున్న ఓ దైవసేవకుణ్ని, అడిగితే ఆ దేవుని సేవకుడు నాకు తెలియదండి అన్నాడు. వెంటనే ఆరార్కేగారన్నారు, మనం రాజులకోసం, అధికారుల కోసం ప్రార్ధించాలి కదా, గవర్నరు ఎవరో తెలియకపోతే ఎలా? అన్నారు. అవునండి. చాలా మంది ఈ లోక విషయాలు మాకెందుకులే! అనుకుంటారు. చాలా సంఘాలలో ఆగస్టు 15 సెలవు రోజని ప్రత్యేక సభలు, యూత్ మీటింగ్స్ ఏర్పాటు చేస్తుంటారు. ఆ సెలవు రోజునే వాడుకుంటారు గాని మన దేశానికి అది ఓ ప్రత్యేకమైన రోజని, ఆ రోజు కోసం దేవునికి వందనాలు చెప్పాలని గుర్తించరు. ఏదో సమస్య వచ్చినప్పుడే మనకు కలెక్టరు గారు, మునిసిపల్

ఆఫీసు గుర్తుకు రావటం కాదు – మన అనుదిన ప్రార్ధనల్లో మన ప్రాంతపు రాజకీయ అవసరతలను ప్రభువు కృపాసనం వద్ద ఎత్తిపడదాము.

అలనాడు ఫరోకు కల వచ్చింది, ఆ కల భావం చెప్పటానికి దేవుని బిడ్డ ఒకడు కావాల్సి వచ్చింది. నెబుకద్నెజరుకు కల వచ్చింది, వచ్చిన కల కూడా మరచిపోయాడు. దేవుని బిడ్డలు నలుగురు ప్రార్ధించగా ఆ కల దానియేలుకు వచ్చింది. జీవము గల దేవుడు ఆ కలలకు భావం తెలియజేశాడు. ఫరో కల భావం తెలియజేసినపుడే యోసేపు కల నెరవేరింది. సౌలు గాడిదలను వెతుక్కుంటూ దైవజనుడైన సమూయేలు దగ్గరకు వచ్చాడు. **'నీ మనస్సులో ఉన్నదంతా నీకు తెలియ జేస్తాను'** అన్నాడు సమూయేలు. దేవుని ప్రజలకు రాజుగా ఉండటానికి దేవుడు సౌలు ఏర్పరచుకున్నాడు గాని సౌలుకు ఆ విషయం తెలియదు. దైవజనుడే ఆ విషయాన్ని తెలియజేశాడు. ప్రతి పట్టణంలో, ప్రతి నగరంలో, ప్రతి గ్రామంలో ఉన్న దైవజనులు వద్దకు ఆ ప్రాంత అధికారులు రావాలంటే దేవుని శక్తి దేవుని సేవకుల్లో వెల్లడి కావాలి.

ఈ రోజున మన దేవునికి, మన సంఘాలలో మన దశమ భాగాలు ఎలా చెల్లిస్తున్నామో అలాగే పన్నులు ప్రభుత్వానికి చెల్లిస్తున్నాము గదా! దేవుని బిడ్డల మీద దేవుని సంఘాన్ని గురించిన బాధ్యతలాగే అధికారుల కోసం ప్రార్ధించాల్సిన బాధ్యత మన మీద ఉందని దేవుని వాక్యం గట్టిగా హెచ్చరిస్తోంది.

అంత మాత్రమే కాదు, అలనాడు యోసేపు, దానియేలులు రాజులకు ఆలోచన కర్తలు అయితే ఆ తరువాత దేవుని బిడ్డలు దావీదు, సొలోమోను రాజులకు ఆలోచన కర్తలు కాదు గాని వారు రాజులే! చాలా మంది దేవుని బిడ్డలు రాజకీయాల్లో గాని, మంచి ఉన్నత పదవుల్లో గాని ఉండటం దేవుని చిత్తం కాదు అనుకుంటారు. ఆ మధ్యన నా హిందు స్నేహితుడు అడిగాడు. **క్రైస్తవులలో ఎక్కువ టీచర్స్‌గా, నర్సులుగా ఉంటారు**? అని, అది నిజమే కదా! పెద్ద, పెద్ద అధికారాలుగా, మంచి బిజినెస్ మెన్‌గా ఉండాలని చాలా మంది విశ్వాసులు కోరుకోరు, ప్రార్ధించరు. చిన్న చిన్న ఉద్యోగాలతో సరిపెట్టుకుని అది భక్తి అనుకుంటారు. మీకో విషయం చెప్పనా? విజయవాడలో టెలిఫోన్స్ జనరల్ మేనేజరు గారు ప్రభువు సాక్ష్యార్ధమై జీవించే దేవుని బిడ్డ. టెలిఫోన్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే హిందువులు సహితం ఆయన నిజాయితీకి, మంచి తనానికి ఎంత మెచ్చుకుంటారో!! ఒక్క సారి ఊహించండి. ఆ విధంగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో, రాజకీయాల్లో, మున్సిపల్ విభాగాల్లో, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో నమ్మకంగా, దేవునికి సాక్షులుగా జీవించే దేవుని బిడ్డలు అధికారులుగా, నాయకులుగా ఉంటే సువార్త ప్రకటన, దేవుని రాజ్య విస్తరణ ఎంత సులభమవుతుంది?!! ప్రార్ధించాలి, అలాంటి వారిని ప్రభువు లేపేట్టు ఆయన కృపాసనం వద్ద విజ్ఞాపన చేయాలి.

మన ప్రభువు 'లోకం' కోసమే కదా, ప్రేమించాడు, ప్రాణమిచ్చాడు. ఈ రోజున దేవుని బిడ్డలకు 'లోకాశలు' ఎక్కువవుతున్నాయి కాని లోకాన్ని గురించిన ప్రేమ తగ్గిపోతోంది!

ప్రియ పాఠకులారా, ఈ స్వాతంత్ర దినోత్సవ సంధర్భంగా ప్రభువు సన్నిధిలో తీర్మానం చేసుకుందాము! లోకానికి నిజమైన ఉప్పులాగా ఉందాము!

మన ప్రభువైన యేసు క్రీస్తు దీవెనాశీర్వాదాలు, ఆయన ఆత్మ అభిషేకము మనందరి మీద సమృద్ధిగా ఉండును గాక!

ప్రభువు సేవలో మీ సోదరుడు

దేవ దండల



ఈ మాసపు ప్రసంగం

# తల్లిదండ్రులు

- ఆచార్య ఆరార్కె



**సీనాయిదేశంలో** వృద్ధులకు అనగా తల్లిదండ్రులకు ఎంతో గౌరవం ఉంది. ఈ విషయంలో వారికి సమాజపు స్పృహ మెండు. వారి మనసాక్షి ఈ విషయమై తేటగా వ్యక్తమవుతుంది. తల్లిదండ్రులు పిల్లలను పెంచుతారు. పిల్లలు పెద్దవారై తల్లిదండ్రులను శ్రద్ధగా చూచుకుంటారు. వారిని వృద్ధాప్యంలో సన్మానిస్తారు. వారికి పరిచర్య చేస్తారు. తల్లిదండ్రులు ఉద్యోగరీత్య (పిల్లలను) వారిని తమదగ్గరే ఉంచుకుంటారు.

ఈ రోజున కూడ ఆధ్యాత్మిక వత్తిడులు ఎన్ని ఉన్నా వృద్ధులకు ప్రభుత్వ ఫించన సదుపాయాలు ఎన్ని ఉన్నా తల్లిదండ్రుల పట్ల వారి పిల్లల వైఖరి నేటికి మారలేదు. అయినా వృద్ధులు సోమరులుగా ఉండరు. ఏదో పని చేస్తూనే ఉంటారు. వృద్ధులు తమ పిల్లలకు సాంఘిక, ఆధ్యాత్మిక విలువలను నేర్పుతారు. కుటుంబాలు కలిసి ఉంటే అది జాతికి గొప్ప ఆశీర్వాదం.

## పునాది కూలిన పూరిగుడిస

అయితే అమెరికాలోని పరిస్థితి చూడండి. 20వ శతాబ్ధారంభానికి అమెరికా జాతిపరంగా పునాది కూలిన పూరిగుడిస అయిపోయింది. ఒకచోట స్థిరంగా ఉండరు. తిరుగుబోతు సంస్కృతి వారికి అలవాటైంది. తల్లిదండ్రులను వృద్ధుల ఆశ్రమంలో చేరుస్తారు. ఎప్పుడో సంవత్సరానికి ఒకసారి వారిని సందర్శిస్తారు. అమెరికా సంస్కృతి నిలకడలేని జీవిత విధానానికి అలవాటు పడింది. చిన్నపిల్లలు కూడా ఎవరికి వారే స్వతంత్రంగా బ్రతకడం నేర్చుకుంటారు. ప్రతిఒక్కరిది ఆర్థిక మనస్తత్వం. తెల్లవారితే మరో రోజు, మరికొన్ని డాలర్లు అని లెక్కవేసుకుంటారు. యువకులు తమకు రాబోయె వృద్ధాప్యం గురించి భయపడతారు. వృద్ధాశ్రమాలలో మహావృద్ధులు తోటకూర కాడలాగా వేలాడుతూ ఉంటారు. అమెరికా ఎటుపోతుందో వారికే తెలియదు.

ఇక మనదేశం సంగతి ఏమిటి? ఈ రోజున 60సం॥రాలకు పైబడిన వారు మనదేశంలో 81 మిలియన్లు ఉన్నారు. వృద్ధులకు ప్రభుత్వం కొన్ని రాయితీలు ప్రకటించింది. అయినా వృద్ధులలో అనేకులు దిక్కులేని స్థితిలో ఉన్నారు. తమ పిల్లలు స్వార్థపరులై తల్లిదండ్రుల క్షేమాన్ని ఖాతరు చేయడం లేదు. ఈ విషయంలో మనం చైనా, జపాన్ దేశం నుండి నేర్చుకోవలసింది ఎంతైనా ఉంది. ముఖ్యంగా క్రైస్తవులు తల్లిదండ్రులను సన్మానించకపోవడం గొప్పనేరం. దశాజ్ఞల్లో సమాజకంగా నిర్గమ 20:12

ఎంతో ముఖ్యమైనది. నీ దేవుడైన యెహోవా, నీకు అనుగ్రహించే దేశంలో నీవు దీర్ఘాయుష్మంతుడవు అవునట్లు నీ తండ్రిని, తల్లిని సన్మానించు. ద్వితీ 6:7 నేడు నేను నీకు ఆజ్ఞాపించే ఈ మాటలు నీ హృదయంలో ఉండాలి. అనగా దేవుని వాక్యం మనలను నడిపించాలి. తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య సరైన సంబంధ సహవాసాలు వారి దేశానికే గొప్ప దీవెన. లేవి 19:32 ఏమంటుంది? తలనెరసినవాని ఎదుట లేచి ముసలివాని ముఖమును ఘనపరచి నీ దేవునికి భయపడాలి.

## కారుచీకటిలో ఆరిపోయే దీపం

అపొస్తలుడైన పౌలు తిమోతికి రాస్తూ 1తిమోతి 1:5లో అన్నాడు. వృద్ధుణ్ణి గద్దింపక తండ్రిగా భావించి అతణ్ణి హెచ్చరించాలి. ఇప్పుడు రోజులు మారిపోతున్నాయి. ప్రత్యక్ష్య నాగరికత మన యువత మీద ఎక్కువ ప్రభావం చూపుతున్నది. అయ్యో మన జాతికి శ్రమ. ద్వితీ 27:16 తనతండ్రినైనా, తన తల్లినైనా నిర్లక్ష్యం చేసేవాడు శాపగ్రస్తుడు. తల్లిదండ్రులను దూషించేవారికి ఎలాంటి శిక్ష విధించబడింది? నిర్గమ 21:17 తన తండ్రినైనను, తల్లినైనను శపించేవాడు నిశ్చయంగా మరణశిక్ష నొందుతాడు. లేవి 20:9 అదేమాట అంటుంది. సొలోమోను కూడ అదే హెచ్చరిక చేస్తున్నాడు. సామెతలు 20:20. తన తండ్రినైన, తల్లినైన దూషించువాని దీపం కారుచీకటిలో ఆరిపోతుంది. అసలు తల్లిదండ్రులు మీద దయలేని కుమారుడు నీచుడని మన సంస్కృతి చెబుతుంది. ద్వితీ 21:18-21 ఒకని కుమారుడు మొండివాడైతే తిరగబడి తండ్రి మాటగాని తల్లిమాటగానీ వినకుండ, శిక్ష విధించిన తరువాత కూడ తల్లిదండ్రులకు లోబడక పోతే వారు అతణ్ణి పెద్దలవద్దకు తెస్తారు. అభియోగాన్ని ప్రకటిస్తారు. వీడు నా కుమారుడు మొండివాడు మాకు తిరగబడుతున్నాడు. మా మాట వినడు, తిండిబోతు, తాగుబోతు. అప్పుడు ఊరి ప్రజలందరు రాళ్ళతో వాడిని చావగొడతారు. గమనించారా! వాక్య ప్రమాణం చాలా ఉన్నతమైనది. తల్లిదండ్రులకు ఎదురుతిరిగేవాడు భ్రష్టుడు.

## విధేయులు దీర్ఘాయుష్మంతులు

సామెతలు 23:22 నిన్ను కనిన నీ తండ్రి ఉపదేశాన్ని అంగీకరించు, నీ తల్లి ముదిమియందు అమెను నిర్లక్ష్యం చేయకు. అందాక ఎందుకు? యేసుప్రభువు తనను పెంచిన తల్లిదండ్రులకు లోబడ్డాడు. లూకా 2:51. యేసు నజరేతులో మరియ, యోసేపులకు లోబడి ఉన్నాడు. పరిసయ్యులు ఈ విషయంలో తప్పుడడుగు వేస్తే ప్రభువు గద్దించాడు. మత్తయి 7:1-13 సారాంశము వినండి. మీరు వేషధారులు పరలోకమందున్న మీ తండ్రిని మీరు మహిమపరచడంలేదు. మీరు చెడ్డవారై ఉండి మీ పిల్లలకు మంచి ఈవులను ఇస్తారు కదా. పరలోకంలో ఉన్న మీ తండ్రిని పోలి నడుచుకోండి. భక్తి ముసుగువేసుకొని తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం మీ వేషధారణను బయలుపరుస్తున్నది. తల్లిదండ్రుల బాధ్యతను తప్పించుకోవడానికి భక్తి ముసుగువేసుకోవడం నీచమైన పని. పౌలు ప్రభోదం ఏమంటుంది? ఎఫెసీ 6:1-4 పిల్లలారా! మీ తల్లిదండ్రులకు విధేయులై ఉండండి. తండ్రులారా! మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలో, బోధలో వారిని పెంచండి. అలాగే కొలస్సీ 3:20,21 వచనాలు 'తల్లిదండ్రులను సన్మానించేవారు దీర్ఘాయుష్మంతులౌతారు. సామెతలు 17:6 కుమారుల కుమారులు వృద్ధులకు కిరీటం. తండ్రులే కుమారులకు అలంకారం తిమోతికి రాస్తు పౌలు అన్నాడు. 2 తిమోతి 3:2 రాను రాను మనుష్యులు స్వార్థప్రియులై తల్లిదండ్రు లకు అవిధేయులు అవుతున్నారు. తీతు 2:2 అంటుంది. వృద్ధులు మితానుభవం కలవారు మాన్యులు స్వస్థబుద్ధి కలవారు విశ్వాసప్రేమ, సహనములుయందు లోపములేనివారై ఉండాలి.

## ఆరోగ్యవంతమైన క్రమశిక్షణ

అది సరే, మరో ప్రశ్న అడగగోరుతాను. క్రమశిక్షణ పేరుతో తల్లిదండ్రులారా మీరు మీ పిల్లలపట్ల చండశాసనులు అవుతున్నారు జాగ్రత్త! క్రైస్తవ గృహం ఆరోగ్యవంతమైన క్రమశిక్షణకు కేంద్రమై ఉండాలి. క్రైస్తవ గృహంలో తల్లిదండ్రులకు హృదయ కాఠిన్యం ఉండకూడదు. పిల్లలు మీ ఆటవస్తువులు కారు. వారూ మనుష్యులే పిల్లలను ప్రేమతో, సహనంతో పెంచడం దేవుని కొరకు సేవ చేసినట్లే. పిల్లలారా! మీరు పెద్దవారైనప్పటికి తల్లిదండ్రులకు లోబడడం ప్రభువుకు లోబడినట్లే. ఈ రోజున తల్లిదండ్రులకు పిల్లలకు ప్రత్యేక శిక్షణ తరగతులు పెట్టాలి. సంఘం ఈ విషయమై పునరాలోచించాలి. తరాల మధ్య అంతరాన్ని ప్రభువు ప్రేమతో నింపాలి. బద్ధలైన సందులో సంఘం నిలబడాలి. మనదేశానికి సంఘానికి ఇది తక్షణ కర్తవ్యం. పెద్దలను గౌరవించే వారు. ప్రభువును సంతోషపెట్టేవారు అవుతారు. ఇంతే సంగతులు ఆమేన్.



ఆధ్యాత్మిక లోతులు

- డా॥ దేవ దండల

# మన స్వాతంత్ర్యం



ఆగస్టు 15 భావతావనికి స్వాతంత్ర్య దినోత్సవము. ప్రపంచ దేశాల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటారు, ఒక్కొకరు ఒక్కో విధానములో జరుపుకుంటారు. అయితే బైబిలు గ్రంథంలో దేవుని ప్రజలయిన ఇశ్రాయేలీయులు కూడా వారి స్వాతంత్ర్యాన్ని 'పస్కా' అనే పండుగ ద్వారా జరుపుకుంటారు. ఇది మిగతా దేశాల వారికంటే చాలా వ్యత్యాసంగా ఉంటుంది. **ఐగుప్తు దేశమంతట మహాఘోష పుట్టెను, అట్టిది ఇక మీదట పుట్టదు. నిర్గమ 11.6**

ఆగస్టు 15వ తేదీన అలాగే జనవరి 26 రిపబ్లిక్‌డే రోజున మరి కొన్ని ముఖ్య సంధర్భాలలో కూడా జెండా వందన కార్యక్రమం ఉంటుంది. జండా వందనం కార్యక్రమంలో విశ్వాసులు పాల్గొనకూడదు అని చెప్పే బోధకులూ లేక పోలేదనుకోండి! కారణమేమంటే అదో విగ్రహారాధన లాంటిది అని సందేహం. గమనించాలి మన దేశ పతాకానికి మనం గౌరవంతో వందనం చేస్తాం!

ఆ మధ్యన ఓ సండే స్కూలులో ***'పాలస్తీనా పిల్లలము, పాలస్తీనా మా దేశం, పాపుల రక్షకుడేసుక్రీస్తు పుట్టిన దేశం మా దేశం'*** అంటూ పిల్లలకు పాట ఒకటి నేర్పించారు.

కొందరు అతిభక్తిపరులు చేసే కొన్ని పిచ్చి పనులు మూలకంగా మన దేశస్థులు మనల్ని అపార్థం చేసుకుంటున్నారు. క్రైస్తవ్యం ఇతర దేశాల మతం అనే అపవాదు ఇప్పటికే మన ప్రియ హిందూస్నేహితుల మనసుల్లో నాటుకపోయింది. కొన్ని సార్లు క్రైస్తవుల మీద జరిగే దాడులకు కారణం ప్రతి సారి ప్రభువు నందు విశ్వాసాన్ని వెల్లడి చేయటం వలన అని చెప్పలేము. మూఢభక్తితో కొందరు చేసే అవివేకపు ప్రకటనలు ఇతరులను ప్రభువు చెంతకు నడిపించేవిగా లేకపోగా వారి కోపాన్ని మరింత ఎక్కువ చేసేవిగా ఉన్నాయి.

ఓ సారి ట్రయిన్‌లో ప్రయాణం చేస్తున్నపుడు బైబిలు చదువుకుంటూ ఉన్నాను. ఎదురుగా ఉన్న వ్యక్తి ఒకాయన చాలా నిశితంగా నన్ను గమనిస్తూ ఉన్నాడు. ఆయనతో సంభాషణ చేసేప్పుడు నాకు తెలియ వచ్చిన విషయం ఏమిటంటే ఆయన ఓ ఆర్‌యసెస్ సభ్యుడని?! చాలా ప్రశ్నలు ఆయన నన్నుడుగుతూ వచ్చాడు. ఆయన ప్రశ్నలకు నా జవాబు అన్నట్టు కాకుండా ప్రతి ప్రశ్నకు జవాబు దేవుని వాక్యంలోనుండే చూపించి తన చేత బైబిలులోని మాటలు చదివించాను. చాలా సేపటి మా సంభాషణ తరువాత తను దిగిపోతూ ఆయన చెప్పిన మాటేమిటంటే ***'దేవా గారూ, క్రిస్టియానిటీ గురించి నాకున్న అపోహాలు ఈ రోజున చాలా తొలగిపోయాయి'*** అన్నాడు.

సువార్తకు సంబంధించిన పుస్తకాలు, మన స్పందన పత్రిక, సాక్ష్యం పుస్తకాలు ఇస్తే కళ్లకుఅద్దుకుని

మరీ తీసుకున్నాడు. దేవుని మాటలు వారి హృదయంలో పనిచేసేలా నేను ప్రార్థిస్తున్నాను, నాతో కలిసి మీరూ ప్రార్థించండి.

సరే మన దేశ ప్రజలు అర్థం చేసుకునే విధానంలో సువార్తను ప్రకటించాలి. సాధారణంగా మన వారు ఉపయోగించే మాట ఒకటి ఏమంటే **'ఏ మతమయినా ఒకటేనండి. అన్ని మతాలు చెప్పేది ఒకటే!'** అని అంటారు. ఆ మాటకు మనమేమి కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇతరులకు సువార్త ప్రకటించేటపుడు మనం గుర్తుంచు కోవాల్సిన ప్రాముఖ్యమైన విషయమేమంటే **నీవు సువార్త చెప్పే సువార్తలో ఎంతో శక్తి ఉంది.** ఎదుటి వ్యక్తి ఎంతో జ్ఞానం కలిగినవాడు, మాటకారి అయినా, నీవు గుర్తుంచుకోవల్సింది విశ్వాసంతో నీ నోటి మాట ద్వారా నీవు వెల్లడి చేయవలసింది నీవు చెప్పే సువార్త, ఆ మాటలు శక్తి కలిగినవి. చాలా సార్లు పెద్ద కొండల్లోని బండలు పగులగొట్టే విధానం మనం చూస్తుంటాం కదా, సువార్త ఓ డైనమైట్ బాంబులా వారి గుండెల్లో పేలుతుంది. ప్రార్థనా పూర్వకంగా, హృదయాంత రంగంలోనుండి ఆత్మల భారంతో నీవు పంచుకొనే ఆ మాటలు మానవ హద్దుబాటులో నీవు చేప్పేవే అయినా వారి మనసుల్లో గునపాల్లా అవి పనిచేస్తాయి. ఏదో అవసరతో, వారి జీవితాల్లో ఏర్పడినపుడో, కష్టం, భాద, వేధన, రోగం ఏదో ఒక సమయంలో నీవు వారికి చెప్పిన జీవం కలిగిన దేవుని మాటలు వారిని ప్రభువు వైపుకు ఆకర్షిస్తాయి. కారణం ఆ మాటల్లో శక్తి ఉన్నది.

మన దేశీయ పద్ధతులలో సువార్త ప్రకటించినపుడు ఎక్కువ ఫలితాలను చూడగలము. మన దేశమంటే మనకు అభిమానముండాలి కదా! కొన్ని సార్లు దైవజనులయినవారిని ప్రజలు పూజించాలి అన్నట్టు చూస్తుంటారు. పేతురు కొర్నేలిని మందలించిన సందర్భం మనకు తెలుసు. కొర్నేలి తనకు తెలిసిన రీతిలో పేతురు భక్తుడు గనుక పూజించాలి అనుకున్నాడు, అతి మితి మీరింది. పేతురు గద్దించాడు. అపో. కార్య. 10. 25, 26. రాజు ఏర్పాటు చేసిన ప్రతిమకు ఆరాధించని యువకులు ముగ్గురిని గురించి దానియేలు 3 అ. లో మనం చూస్తాము. దేవుడు వారిని దీవించాడు, హెచ్చించాడు.

అయితే మన జాతీయ జెండా మన దేశానికి ప్రతినిధి. మనం జెండా వందనం చేస్తున్నామంటే మన దేశమంటే ప్రేమను, గౌరవాన్ని చూపుతున్నాం. మనం జాతీయ వాదులు కానక్కర లేదు గాని దేశాభిమానులమై యుండాలి. పరిశుద్ధ గ్రంధం దేశ భక్తికి విరుద్ధమేమి కాదని గమనించాలి. అపోస్తులుడైన పౌలు భక్తుడు రోమా దేశం అన్య దేశమైనా రామీయు పౌరసత్వం గురించి ఎంతో గర్వపడ్డాడు. అపో. కార్య. 22. 25-29.

యూదులు లోకమంతా చెదిరిపోయారు. తమ దేశాన్ని వారు ఎంతగా ప్రేమిస్తారో! చెదిరియున్న వారంతా తిరిగి తమ దేశానికి రావాలని ఎంతో ఆశతో ఉంటారు. అఫకోర్స్ - అందులో ప్రవచన నెరవేర్పు ఉందనుకోండి. ఒక యూదుడు తన దేశాన్ని ఎంతగా ప్రేమిస్తాడో మనం తెలుసుకోవాలంటే మరోమారు మనం 137 కీర్తన చదవాలి. యెరూషలేము వారికి "ముఖ్య సంతోషము", "కుడి చేయి" వలె అది ఎంతో ప్రియము. వ. 5, 6.

పౌలు భక్తుడు మన పౌరసత్వం పరలోకందున్నది అన్నాడు. అయితే ఈ పౌరసత్వం ఈ భూమి మీదనున్న ప్రస్తుత పౌరసత్వాన్ని రద్దు చేయదు. అభివృద్ధి చెందిన ఇతర దేశాల్లో సంఘములో తప్పక దేశ పతాకం కూడా ఉంటుంది. ఇది దేవుని వాక్యాను సారము, పరిపూర్ణ క్రమము. దేవుని వాక్యంలో మనం చదువుతాము కదా, ప్రతి అధికారము దేవుని వద్దనుండి వచ్చినవి కావా? ఈ రోజున మనం సంఘ అధికారానికి అపోస్తలులు, ప్రవక్తలు, సువార్తికులు, కాపరులు, ఉపదేశకులు - ఎలా లోబడుతామో అలాగే రోమా 13.1 అధికారులకోసం ప్రార్థించాలి, లోబడాలి. మనలో మాటలో మనం చెప్పుకున్నట్టు మనం టైత్‌ను (దశమ భాగాలను) సంఘానికి, టాక్సను (పన్నులు, సుంకాలను) ప్రభుత్వానికి చెల్లిస్తున్నాము కాదా!

మన దేవాలయముల మీద లేదా పరిసర ప్రాంతాలలో మన దేశ పతాకాన్ని ఆగస్టు 15న గాని లేదా జనవరి 26న గాని ఎందుకు ఎగురవేయకూడదు? ఈ రోజుల్లో వచ్చే సెలవులను ఉపయోగించుకుని ప్రత్యేక కూడికలు పెట్టుకున్నట్టే దేశం కోసం ప్రార్థించటానికి ఈ తేదీలను మనం ఎందుకు ఉపయోగించుకోకూడదు? విశ్వాసులారా, ప్రార్థిద్దాం ప్రభువు ఆత్మ మనలను నడిపించును గాక! హెపీ ఇండిపెండెన్స్ డే!



ఆర్.ఏలూజై

# స్వాతంత్ర్య సత్యాలు




**జై భోలో...** జై భోలో... స్వతంత్ర్య భారత్‌కీ జై భోలో... వీనుల విందుగా వినివిస్తున్న దేశభక్తిగీతపు గానామృతంతో, ఒక్కసారిగా, ఆ ప్రాంత మంతా, మధురభావనలమయమై పోయింది. గేయంలోని భావ సాహిత్యము, రాగమాధుర్యము, ఒకదానితోనొకటి పోటీపడుతూ, శబ్దతరంగాలలో మమేకమైపోతూ, మనసున పదనిసలు పలికిస్తుంటే, మదిలో అణువణువునా దేశాభిమానం పరవళ్ళు తొక్కుతుంటే, ఉరివే ఉత్సాహంతో, ఉత్సవ సిద్ధపాటు కార్యక్రమాలలో మునిగిపోయిందా బృందం. వారి సాధకత్వాన్ని, జాతీయతత్వాన్ని, ప్రేమతో పరికిస్తూ, వాలుకుర్చీలో వెనక్కు వాలి, గతాన్ని స్వగతంలోనికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాడా సమరయోధుడు.

**యోధుని వదనం**

అప్పటికి ఇంచుమించు 65 వసంతాల ముందటిమాట కావచ్చేమే! దేశస్వాతంత్ర్యం కోసం, జఠిలంగా సాగుతున్న ఉద్యమాన్ని, కుటిలంగా అణగద్రొక్కేందుకే ఆంగ్లేయులు అష్టకష్టాలూ పడుతున్న రోజులవి. 200 సంవత్సరాలకు పైబడి కొనసాగిన ఆంగ్లేయుల పరిపాలనలో, వారి ప్రభుత్వ విధానాలపైనా, వ్యవహార సరళిపైనా, యోధానుయోధులందరూ సమర శంఖాన్ని పూరించి, కలిసికట్టుగా సాతంత్ర్యపోరాటాన్ని కొనసాగిస్తున్న రోజులవి. వారు ప్రవేశపెట్టిన సామాజిక అభ్యుదయ విధివిధానాలకు వ్యతిరిక్తులై కాదుగాని, వారి నిరంకుశ ధోరణితో కలత చెంది కదంత్రొక్కిన స్వాతంత్ర్య సంగ్రామమది. 'స్వరాజ్యం నా జన్మహక్కు. దానినెలాగైనా సాధించి తీరుతాను' అంటూ నిప్పులు చెరిగిన తిలక్ పలుకుల్ని, 'ముఝే ఖూన్ దేదో, మై తుమే ఆజాదీ దూంగా' అంటూ గర్జించిన సుభాష్ చంద్రబోస్ ఆవేశాన్ని, 'సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికై స్వాతంత్ర్యం కావాలి,' (I want freedom for the full expression of my personality) అంటూ, 'సత్యమేవ జయతే' అని నినదిస్తూ, అహింసాయుత మార్గంలో, స్వాతంత్ర్య సమరాన్ని ముందుకు నడిపిన, మహాత్ముని మాటల్ని మననం చేసుకుంటుంటే, అప్రయత్నంగానే మందహాసం మెరిసిందా యోధుని వదనంలో.

## స్వాతంత్ర్య సత్యాలు

ఇంతలో వరుగున వచ్చాడో బాలకుడు. **'తాతయ్యా! స్వాతంత్ర్యమంటే ఏమిటి?'** ఆసక్తి ధ్వనించిందా చిన్నారి కంఠంలో. **"బానిసత్వపు అంధకార బంధకాలను ఛేదించుకుని స్వేచ్ఛాయుత జీవనాన్ని కలిగియుండడమే"** కొంచెం ఉద్వేగంగా బదులిచ్చాడా యోధుడు. **"అంటే మనకిష్టమైన విధంగా జీవించగలగడమేనా స్వాతంత్ర్యం?'** సందేహం వెలుబుచ్చాడా బాలుడు. **'స్వాతంత్ర్యమంటే బాధ్యతాయుతంగా నడుచుకోవడం'** స్పష్టంచేశాడు తాతయ్య. **'మరి మనకు స్వాతంత్ర్యం ఎలా వచ్చిందేమిటి?'** మళ్ళీ ప్రశ్నించాడు. **'మహాత్ముని సారథ్యంలో ఇతర నాయకులు ఇంకా మాతరంలోని వారు, దేశమంతా కలిసికట్టుగా పోరాడడం వలన మనకు స్వాతంత్ర్యం లభించింది'** మాటలు ముగియడంతో రివ్వున జాతీయ పతాకం చెంతకు పరుగులు తీశాడా బాలకుడు.

## ఆత్మ స్వాతంత్ర్యం

మనదేశ స్వాతంత్ర్యం – కలిసికట్టుగా సాధించిన ఘనవిజయం– స్వాతంత్ర్యమంటే స్వేచ్ఛాయుత జీవనాన్ని కలిగియుండే అనుభవం– బాధ్యతాయుతంగా మెలగవలసిన అవసరం – ఎంతటి తియ్యని తలపులు తాతయ్య పలుకులు! – మరి మనదేశ స్వాతంత్ర్య సత్యాలతో పాటు, నిత్యమైన ఆత్మస్వాతంత్ర్య సంబంధిత సులక్షణాలను కూడా అవలోకిస్తేనే, అనునిత్యం వాటిని సాధన చేస్తేనే, మానవునికి సంపూర్ణ స్వాతంత్ర్యము ఇప్పుడు ఇహలోకంలో, అటు పిమ్మట పరలోకంలో సిద్ధించు ననునది ఎంతైనా నమ్మదగిన సత్యమని అర్థమవుతుంది.

## ఐక్యపోరాటం

ఈ (ఆత్మ) స్వాతంత్ర్యము అనుగ్రహించి క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు (గలతీ 5:1) అని తెలియజేస్తూనే, 'ప్రభువు యొక్క ఆత్మ ఎక్కడనుండునో అక్కడ స్వాతంత్ర్యముండును (2 కొరింధి 3:17) అని తెలుపుతుంది పవిత్ర బైబిలుగ్రంధం. అంటే ప్రభువనుగ్రహించు ఆత్మ స్వాతంత్ర్యము మన జీవితాలలో నిత్యమై, నిఖిలమై నిలిచియుండాలంటే, ప్రభుని ఆత్మ మనలో నివసించవలసిన అవసరత ఎంతైనా వుందనేది సత్యం. మరి ఆ ఆత్మ సాక్షాత్కారం మన జీవితాలలో కలగాలంటే, ప్రాణాత్మ దేహములు ఈ లోక సంబంధమైన పారంపర్యాచరములపై ఐక్యంగా అలుపెరుగని పోరాటం చేయాల్సిందే. మరియు 'మనము పోరాడునది శరీరులతో కాదుగాని... అంధకార సంబంధులతోను, దురాత్మల సమూహముతోను పోరాడుచున్నాము గనుక (ఎఫెసీ 6:12) సత్యము, నీతి, సిద్ధమనస్సులను ధరించుకొనవలసిన వారమై యున్నాము. ఆత్మస్వాతంత్ర్యమును స్థిరపరచునది ఐక్యపోరాటమే.

## బాధ్యతాయుత స్వాతంత్ర్యం

ఏలయనగా 'మీరు స్వతంత్రులుగా ఉండుటకు పిలువబడితిరి. అయితే ఆ స్వాతంత్ర్యమును శారీరక క్రియలకు హేతువు చేసికొనక (గలతీ 5:1) ప్రేమ కలిగినవారై యొకనికొకడు దాసులై యుండుడి.' అంటూ ఎలా మెలగాలో తెలియజేస్తుంది బైబిలు గ్రంథం. బాధ్యతాయుతమైనది ఆత్మస్వాతంత్ర్యం. స్వేచ్ఛా జీవనం మరియు స్వాతంత్ర్యము నియమము నిచ్చును (యాకోబు 2:12) సంపూర్ణ నియమములో నిలకడగానుండుట స్వాతంత్ర్యము నిచ్చును, అని తెలుపుతుంది. లేఖనగ్రంథం. అంటే దైవవాక్యము మనకనుగ్రహించు నీతి నియమములయందు నిలకడగా నిలచియుండుటయే స్వేచ్ఛాయుత ఆత్మీ జీవన ఆరంభం మరియు దాని కొనసాగింపు అని పేర్కొనవచ్చు.

## ముగింపు:

ఈ విధంగా దేశస్వాతంత్ర్య సత్యాలను, ఆత్మీయ స్వాతంత్ర్య సూత్రాలను పరికించి చూస్తే అర్థమయ్యేదేమిటంటే, సంపూర్ణ మానసిక ఆత్మీయక స్వాతంత్ర్యం వ్యక్తిగత జీవితంలో సిద్ధించాలంటే ఐక్యపోరాటం మరియు బాధ్యతాయుత జీవనమనేవి, అత్యంత ప్రాముఖ్యమైన సూత్రాలని తెలుస్తుంది. వాటిని అనుసరిస్తేనే ఆ స్వాతంత్ర్యఫలాలు సామజిక, సాంఘిక, ఆధ్యాత్మిక ఇత్యాది అన్ని రంగాల్లోనూ అందరికీ అందించగలమనీ అర్థమవుతుంది. అందుకే దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ మాసంలో, మనలో ఈ ఆలోచనలను కలిగించిన మనదేవుడు అందిస్తున్న ఆత్మ స్వాతంత్ర్యాన్ని అందరూ అందుకోవాలని అకాంక్షిద్దాం.



డా॥యేలూరి ఆశీర్వాదం

# దాస్యవిమోచన



**దే**శమా, దేశమా, దేశమా! యెహోవా మాట వినుము. (యిర్మియా 22:29) ... నన్ను వెదకి, తమ చెడు మార్గములను విడిచన యెడల, ఆకాశము నుండి నేను వారి ప్రార్థనను విని, వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును. (2 దిన 7:14)

**"స్వాతంత్ర్యము నా జన్మహక్కు'**

-బాలగంగాధర్ తిలక్

**'స్వేచ్ఛ అంటే బాధ్యత. అందుకే దానికి అధిక సంఖ్యాకులు భయపడతారు'**

- బెర్నార్డ్ షా

**''స్వేచ్ఛ - స్వాతంత్ర్యాలనేవి ప్రజాస్వామ్య దేశానికి ప్రాతిపదికలు'**

-అరిస్టాటిల్

**'నాకు స్వాతంత్ర్యం యివ్వండి, లేదా నాకు మరణం యివ్వండి'**

అమెరికా భక్తుడు -పాట్రిక్ హెన్రీ

స్వాతంత్ర్యం అనేది మనకు ఒకే వ్యక్తివలన, ఒకేసారి వచ్చింది కాదు. 1757 ప్లాసీ యుద్ధం, 1885 భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన, 1915 నుండి స్వాతంత్ర్య సమరం ప్రారంభం, సైమన్ కమిషన్, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా తీర్మానం వగైరా అనేక ఉద్యమాల సమరం. 1945వ సం॥ ద్వితీయ ప్రపంచసంగ్రామం అనంతరం, అనేకమంది త్యాగ ఫలితంగా, ఎందరో ప్రాణదానాల మూలంగా, చిట్టచివరకు 1947 ఆగస్టు 15 అర్ధరాత్రి స్వాతంత్ర్యం లభించింది. ఆ రోజు పర్వదినం దేశప్రజలకు కనులపండుగ ఆబాలగోపాలానికి ఆనందం. తొలి రాష్ట్రపతి డా॥ బాబూ రాజేంద్రప్రసాద్, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సారధ్యంలో మనలను మనమే పరిపాలించుకున్నాం.

గొప్ప సంస్కృతి-సాంప్రదాయాల ఘనచరిత్ర గల దేశం భారతదేశం. ఉపఖండంగా ఆవిర్భవించి, ప్రపంచంలో కెల్ల అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమయ్యింది. ఆనాటి త్యాగధనులు నేడు లేరు(అరుదు). నేడు అంతా దోచుకోవడం - దాచుకోవడంపై ఎక్కువ మక్కువ చాలా మందికి. అందుకే ప్రాణ త్యాగాలు చేసిన అమర వీరులను నాయకులను గుర్తుచేసుకుని స్వాతంత్ర్య ఫలాలు అనభవిస్తున్న మనం మంచి పౌరులుగా దేశ భక్తి కలిగి జాతీయ సమైక్యత తో బాధ్యతతో మెలగాలి .దేశసుభిక్షత కోసం ప్రార్థించాలి .

మనం సంపూర్ణ భక్తియు మాన్యతయు కలిగి నెమ్మదిగా సుఖంగా బ్రతుకునిమిత్తం అన్నింటి కంటే ముఖ్యంగా మనుష్యులందరి కోరకును, ప్రార్థనలును ,యాచనలను కృతజ్ఞత సుత్తులను చేయవలెనని అపోస్తులుడైన

పౌలు హెచ్చరించాడు. (1 తిమోతి2:2)

**దాస్య విమోచన**

ఐగుప్తు ఫరోలు ఇశ్రాయేలీయుల చేత వెట్టి చాకిరి చేయించుకొనిరి. కనికర హీనులై, కఠినులై పాలించిరి. దాదాపు 430సం ఐగుప్తు చెరలో–బానిసత్వంలో శ్రమలు భరించి, విసిగి వేశారారు. ఈజిప్టు పిరమిడ్స్ వారిచేతనే కట్టించారు. (ప్రపంచ వింతలలో ఒకటి) హెబ్రీజాతి అభివృద్ధి కాకుండ మగశిశువులను పురిటిలోనే చంపించుట రాజాజ్ఞ.

ఫరోకాడి క్రింద నలిగిపోయిన ఇశ్రాయేలీయుల బ్రతుకులు అతలాకుతలమై, వారి భవిష్యత్ శూన్యమై, మనస్సులు కకాలావికలమైన స్థితిలో వారి మూలుగును విని‌న హెబ్రూ జాతి ఆరాధ్యదైవమైన జీవముగల దేవుడు యెహోవా (యావే) మోషే–అహరోనుల ద్వారా వారి పరిస్థితిని చక్కజేసి విడిపించి నడిపించాడు.

**పాపదాస్య విమోచన**

ఈజిప్టునుండి హెబ్రీజాతి విముక్తి అద్భుతకార్యములవలన జరుగలేదు. పస్కా గొర్రె రక్తప్రోక్షణ వలన కలిగింది. 'క్రీస్తు' అను మన పస్కాపశువు వధింపబడెను.(1కొరి 5:7)

–అపో.పౌలు

వెండి బంగారములవంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింప బడలేదు గాని అమూల్యమైన రక్తము చేత అనగా నిర్దోషమును, నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తు రక్తము చేత విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా! –పరి.పేతురు.

సైతానుకట్లనుండి విడుదల: ఇదిగో 18 ఏండ్లనుండి సైతాను బంధించిన అబ్రాహాము కుమార్తెయైన ఈమెను ఈ కట్లనుండి విడిపింపతగదా?

– యేసు

**సత్యము ద్వారా స్వాతంత్ర్యము**

సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును.

**ఆత్మీయ స్వాతంత్ర్యము**

సహోదరులారా! మీరు స్వతంత్రులుగా ఉండుటకు పిలువబడితిరి. అయితే ఒకమాట, ఆ స్వాతంత్ర్యమును శారీరక క్రియకు హేతువు చేసికొనక, ప్రేమ కలిగినవారై, యొకనికొకడు దాసులై యుండుడి. ధర్మశాస్త్రమంతయు నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము అను ఒక్కమాటతో సంపూర్ణమైయున్నది.

–పౌలు

**మహిమగల స్వాతంత్ర్యము**

సృష్టి నాశనమునకు లోనయిన దాస్యములోనుండి విడిపింపబడి, దేవుని పిల్లలు పొందబోవు మహిమ గల స్వాతంత్ర్యము పొందుదనను నిరీక్షణ కలదై, స్వేచ్ఛగా కాక దానిని లోపరచిన వాని మూలముగా వ్యర్థపరచబడును. (రోమా 8:20:23)

**అపో.పౌలు సలహాలు**

అన్నిటియందు నాకు స్వాతంత్ర్యం కలదుగాని, అన్నియు చేయదగినవి కావు. అన్నిటియందు నాకు స్వాతంత్ర్యముకలదు గాని, నేను దేనిచేతను లోపరచుకొనబడనొల్లను. అన్నియు క్షేమాభివృద్ధి కలుగజేయవు.

ప్రభువునందు పిలువబడిన దానుడు – ప్రభువువలన స్వాతంత్ర్యము పొందినవాడు. ఆ ప్రకారమే స్వతంత్రుడైయుండి పిలువబడిన వాడు క్రీస్తుదాసుడు. మీరు విలువబెట్టి కొనబడినవారు, ఎవనికి దాసులు కాకుడి.

అయినను మీకు కలిగిన యీ స్వాతంత్ర్యము వలన బలహీనులకు అభ్యంతరము కలుగకుండ చూచుకొనుడి. –అపో.పౌలు

**యాకోబు హెచ్చరిక**

అయితే స్వాతంత్ర్యమునిచ్చు సంపూర్ణమైన నియమములో తేరిచూచి, నిలకడగా ఉండువాడెవడో వాడువిని, మరచువాడు కాక, క్రియను చేయువాడైయుండి, తనక్రియలో ధన్యుడగును. స్వాతంత్ర్యమునిచ్చు నియమముచొప్పున తీర్పుపొందబోవు వారికి తగినట్టుగా మాట్లాడుడి. ఆలాగుననే ప్రవర్తించుడి. –యాకోబు

**పేతురు సలహాలు**

'తామే భ్రష్టత్వమునకు దాసులైయుండియు, అట్టివారికి స్వాతంత్ర్యము యిత్తుమని చెప్పుదురు. స్వతంత్ర్యులైయుండియు, దుష్టత్వమునకు మీ స్వాతంత్ర్యమును వినియోగపరచక దేవునిదాసులమని లోబడుడి.

– పరి.పేతురు

**ముగింపు**

ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి, క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసెను. కాబట్టి మీరు స్థిరముగా నిలిచి, మరల దాస్యమను కాడిక్రింద చిక్కుకొనకుడి. (గలతీ 5:1)

జీవితకాలమంతయు మరణభయము చేత దాస్యమునకు లోబడిన వారిని విడిపించుటకు ఆయన రక్తమాంసములలో పాలివాడాయెను. (హెబ్రీ 2:14–15) యేసే మన విమోచకుడు. ప్రభువు ద్వారానే నిజమైన స్వాతంత్ర్యము. దైవాశీస్సులు.



రెవ.బి.యస్.ప్రకాశ్

# బ్లెస్సింగ్ ఉమెన్



**ప**రిశుద్ధగ్రంథములో కొంగు బిగించిన వనితలు ఎంతోమంది ఉన్నారు. అందులో ఒకామె గురించి తెలుసుకుందాం.

ఇశ్రాయేలీయులు ఐగుప్తు బానిసత్వంలో ఉన్నరోజులవి. దేవుని ప్రజలైన ఈ ఇశ్రాయేలీయులు ఒకనాడు, పేరు ప్రతిష్టలుతో వర్ధిల్లినవారే. అయినప్పటికి దేవుణ్ని దిక్కరించి, ఆయన మార్గమును విడచి, విచ్చలవిడిగా జీవించడం ద్వారా ఆ జాతియావత్తు బానిసత్వం లోకి దిగజారిపోయింది. వారు చేసిన పాపం ఏమిటంటే నిజ దేవుణ్ని వ్యతిరేకించటం, ఆయనకు ప్రథమ స్థానం ఇవ్వక పోవడమువలన చివరకు ఐగుప్తు బానిసలయ్యారు.

ఇశ్రాయేలీయుల సంతతి విస్తరిస్తున్నందు వల్ల వారిని అణిచి వేయడానికి వారిచేత కఠినముగా పనులు చేయించటానికి ఫరో ఆదేశించాడు. అంతమాత్రమే కాకుండా ఆ దేశములో హెబ్రీ స్త్రీలకు మగ పిల్లవాడు పుట్టినట్లయితే పురిటిలోనే చంపవలెనని మంత్రసానులకు ఆజ్ఞలను జారిచేసాడు.

## మోషే జననం

అదే సమయంలో ''అమ్రాము, యొకెబెదు'' అను దంపతులకు ఒక మగపిల్లవాడు పుట్టాడు. ఫరో ఆజ్ఞ ప్రకారము చంపబడతాడని బహు జాగ్రత్తలు తీసుకుని, వారికి తెలిసిన ప్రతిప్రయత్నాన్ని ఉపయోగించి దాచి పెట్టినప్పటికి, ఇక దాచడానికి వీలులేక ఆ బాలుణ్ని ఒక జమ్ముపెట్టిలో ఉంచి నైలునదిలో విడిచిపెట్టారు.

''నీవు జలములలోబడి దాటునప్పుడు నేను నీకు తోడైయుందును నదులలోబడి వెళ్ళినప్పుడు అవి నీ మీద పొర్లిపారవు.

**"యెహోవానగు నేను నీకు దేవుడను. ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడనైన నేను నిన్ను రక్షించువాడను".** యెషయా 43:2-3

పై వాక్యమును బట్టి ప్రమాద పరిస్థితుల్లో దేవుని మీద ఆధారపడటం మనకు నేర్పుతుంది. అగ్నిలో పడవేయబడినా, నీటిలో విడిచి పెట్టబడినా, చెరసాలలో బందించినా, సింహాల బోనులో పడవేసినా దేవుడు తన ప్రజలను విడిచిపెట్టడు. ఆయన తన వారిని రక్షించగలడు, సంరక్షించగలడు.

## నైలునదిలో జమ్ముపెట్టె

మూడునెలలు ఆ మగ పిల్లవానిని దాచి, ఇక దాచలేక జమ్ము పెట్టెలో ఆ బాలుణ్ణి ఉంచి నైలునదిలో విడిచిపెట్టారు. ఆ బాలునికేమి సంభవిస్తుందోనని తెలిసికోవాడానికి ఆ పిల్లవాని అక్క ఆ నైలునది ఒడ్డున దూరము నుండి కనిపెడుతుంది. ఇంతలో ఫరో కుమార్తె

స్నానము చేయుడానికి ఏటికి తన పనికత్తెలతో వస్తూ అలా ఏటిఒడ్డున నడుస్తుండగా నీటిలో ఉన్న నాచు మొక్కలలో చిక్కి ఉన్న ఒక పెట్టెను, ఫరో కుమార్తె కంట పడింది. దానిని తెప్పించి, తెరచి చూడగా చక్కని పిల్లవానిని చూచి ఆశ్చర్యపడింది, ఒకవైపు సంబరపడింది.

ఆ పిల్లవాడు ఏడ్చుచుండగా చూచి కనికరించి, వీడు హెబ్రీయుల పిల్లలలో ఒకడు అని అంది. అప్పుడు వాని అక్క ఫరో కుమార్తెతో నీ కొరకు ఈ పిల్లవానిని పెంచుటకు నేను వెళ్ళి హెబ్రీ స్త్రీలలో ఒకామెను పిలుచుకొని వస్తాను అంది. అందుకు ఫరో కుమార్తె వెళ్ళుమనగా, ఆ చిన్నది వెళ్ళి ఆ బిడ్డ తల్లిని పిలుచుకొని వచ్చింది.

ఫరో కుమార్తె ఆమెతో ఈ బిడ్డను తీసుకొనిపోయి, నా కొరకు వానికి పాలిచ్చి పెంచు, నేను నీకు జీతమిస్తానని చెప్పగా, ఆ స్త్రీ ఆ బిడ్డను పాలిచ్చి పెంచుటకు తీసుకొని వెళ్ళింది.

**"దేవుడు మా పక్షమున పూర్ణ రక్షణ కలుగుజేయు దేవుడై యున్నాడు. మరణము తప్పించుట ప్రభువైన యెహోవా వశము".** -కీర్తన 68:19-20

**"మృతినొందించువాడను బ్రతికించు వాడను నేను గాయపరచువాడను స్వస్థపరచువాడను నేను."**

## తల్లి బాధ్యత

తన తండ్రి కఠినమైన ఆజ్ఞ జ్ఞాపకము వచ్చినప్పటికి ఒక ప్రక్క తనలో దాగి వున్న సహజ సిద్ధమైన స్త్రీతత్వము, మాతృత్వము, జాలి, కనికరము తన మనసు తట్టి మేల్కొలిపింది. నిస్సహాయతలో ఉన్న ఆ చిన్నవాని చూచి నిండు మనసుతో ఆదరించి అక్కున చేర్చుకుంది. తెగించి, గొప్ప తెగువతో తన కొంగుబిగించి ఆ పిల్లవానికి తల్లిగా బాధ్యతను స్వీకరించి, నా కొరకు పెంచమని, ఆజ్ఞజారి చేసింది. తన తండ్రి ఒక పక్క మగ పిల్లలను చంపమని ఆజ్ఞ ప్రకటించినను, లెక్కచేయక, ఏది ఏమైన సరే ఆ పిల్ల వాడు పెద్దవాడవ్వాలి, నా కుమారుడు అనిపించుకోవాలని ఒక పట్టుదల, ఆశయం ఆమెను వెన్నుతట్టిలేపింది.

**"మీరు మంచి విషయములో ఆసక్తిగల వారైతే మీకు హాని చేయువాడెవడు? మీరొక వేళ నీతి నిమిత్తము శ్రమపడినను మీరు ధన్యులే, వారి బెదిరింపునకు భయపడకుడి కలవరపడకుడి" 1పేతురు 3:13**

తాను తెగించి మంచిపని చేసినందుకు తన హృదయమంతా సంతోషముతో నింపుకుంది.

ప్రియమైన వారలారా! మీరు ఉన్న పరిసర ప్రాంతాలలో తేరి చూస్తే ఎందరో నిస్సహాయత స్థితిలో ఉండి, ఎవరో సహాయము చేస్తారని ఎదురు చూసే ప్రజలు ఎందరో మనకు కనిపిస్తారు. ఏనాడైన అట్టివారికి సహాయము చేయకలిగి ఉన్నావా ఒక్కసారి ఆలోచించండి.

## దేవుని ప్రేమ

ఒక వ్యక్తిగా నీలో ఉన్న సహజ సిద్ధమైన ప్రేమను అనురాగాన్ని ఆప్యాయతను బాధలో ఉండే వారికి, కన్నీళ్లతో కష్టాలలో మునిగి పోతున్నవారికి సహాయము అందించండి. ప్రేమతో చూడండి. నీ ఇంటిలోనికి లేక కుటుంబము లోనికి ఒక క్రొత్తమనిషి చేరితే, ఆప్యాయత అనురాగము చూపండి. నూతన ఆత్మ మా ఇంటిలోనికి చేరారని సంతోషముతో అక్కున చేర్చుకోండి.

ఎరుసు బుద్ధితో చూడకండి, నిందలు వేయకుండ వారి పట్ల చాడీలు వినకుండ, చెప్పకుండ, జాలితో దయతో చూడండి. ఒక అన్యురాలైన ఫరో కుమార్తెవలె "కొంగుబిగించి" తన తండ్రి ఆజ్ఞను దిక్కరించి, తెగించి గొప్ప తెగువలో, మాతృప్రేమతో ఆ పిల్లవానిని తన కుమారుడిగా ఎలా చేర్చుకుందో, ప్రభువును నమ్మిన వారు క్రొత్తవారిని ప్రేమతో మాట్లాడి క్రీస్తు యేసుకు కలిగిన మనసుతో, ప్రేమను కనువరచి సొంతమనిషిగా లేక సొంతబిడ్డగా చేర్చుకోండి "కొంగుబిగించిన" వనితగా పేరు తెచ్చుకోండి.

## దేవుని ఎంచిన మనుష్యులు

దేవుని యొక్క ప్రణాళిక ప్రజలపై ఉంచి, తన కార్యములను నెరవేర్చ బడటానికి ప్రజలలో ఎవరినొకరిని దేవుడు ఎంచుకుంటారు.

దేవుడు అనేక సార్లు అవకాశము ఇచ్చినా సద్వినియోగం చేసుకోలేక పోయిన వారెందరో ఉన్నారు. అందులో నీవు ఉన్నావోమే ఒకసారి ఆలోచించండి. ఈ సారి అయినా అవకాశము వస్తే "నడుంబిగించి" దేవుని కార్యములు చేయండి. దేవునిని మహిమ పరచండి. దీవెనలు పొందండి.

ఆ పిల్లవాడు పెద్దవాడైన తరువాత ఆమె ఫరో కుమార్తె వద్దకు అతనిని తీసుకొని వచ్చింది. అతడు ఫరో కుమార్తెకు కుమారుడయ్యాడు. ఆమె నీటిలో నుండి ఇతనిని తీసాను అని అతనికి 'మోషే' అను పేరు పెట్టింది. "కొంగుబిగించిన వనిత"గా పేరు తెచ్చుకుంది. ఆ బిడ్డ విషయములో గొప్ప నిర్ణయాన్ని తీసుకొని స్త్రీ జాతికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు కలుగజేసింది. స్త్రీ జాతిలో గొప్ప సవాలుగా నిలిచింది. "ఉమెన్స్ డే పంక్షన్"లో ఈమెను ఎంతగానో గౌరవించి, "గ్రేట్ బ్లెస్సింగ్ ఉమెన్ ఇన్ ద వరల్డ్ ఫ్రమ్ జెహోవా" అనే బిరుదుకు అర్హురాలు అని చాటి చెప్పబడింది. దేవుడు మిమ్ములను బహుగా దీవించును గాక! ఆమెన్! హాల్లెలూయా!!

## Spiritual Understands

**ప్రవాసి**

# యేసుతో.... యేసులో....



**బైబిలు** క్రైస్తవుల ప్రామాణిక గ్రంథం. న్యాయ 11:28 అంటోంది. యేసు ఉవాచ "ప్రయాసబడి భారము మోసుకుంటున్న సమస్త ప్రజలారా నావద్దకు, నాలోనికి రండి. నేను మీకు విశ్రాంతి కలుగజేస్తాను.'' 20 శతాబ్దాలకు పైగా యేసు పిలుపు విన్న అనేకమంది ఆయన దగ్గరికి వచ్చారు కాని కొద్దిమంది అయనలోకి వచ్చారు. ఆయన దగ్గరికి వచ్చిన వారు క్రైస్తవ మతస్థులు. ఆయనలోకి వచ్చినవారు మతాతీతులు.

### క్రైస్తవులు

క్రీస్తును అంగీకరించినవారికి ఎన్నో సమస్యలు, కష్టాలు, హింసలు ప్రాప్తిస్తాయి. ఇంతకూ క్రైస్తవులు అవడమంటే ఏమిటి? అనే అంశాన్ని మనవాళ్ళు సరిగా అలోచించడం లేదు. క్రైస్తవం అనేది మతం కాదు క్రీస్తునందు అది ఒక ఉద్యమం! ఆధ్యాత్మిక విప్లవం. 1తిమోతి 1:15లో భక్తపౌలు అన్నాడు. క్రీస్తు యేసు పాపులకు రక్షించడానికి ఈ లోకానికి వచ్చాడు. నేను ఆయన రక్షించిన పాపులలో అతి ఘోరపాపిని

### విలక్షణ వ్యక్తిత్వం

ఒక విషయం అందరూ ఆలోచించాలి. యేసుక్రీస్తు వ్యక్తిత్వం విలక్షణమైనది. మానవత అంతటిలో ఏది మంచిదో, ఏది పవిత్రమో, ఏది ఉన్నతమో అదంతా క్రీస్తునందు కేంద్రీకరించబడి ఉంది. ఆయన వ్యక్తిత్వం సంపూర్ణమైనది, సమగ్రమైనది. దానినెవరూ మెరుగు పరచనవసరం లేదు. సహజాతీతమైనది క్రీస్తునందు సహజంగా నివసించింది. యేసు ఇహలోక జీవితం మానవులందరి మధ్య ఒక ప్రత్యేకతను సంతరించు కుంది. క్రీస్తులాగ మనిషి బతకాలంటే క్రీస్తునందు బతకాలి. క్రీస్తుకు బయట ఆయనను అనుకరించటం ఎవరికీ సాధ్యము కాదు. క్రీస్తు ఎవరిలాగా ఉన్నాడు? దేవుడిలాగా ఉన్నాడు, క్రీస్తు తనలాగే తానున్నాడు. యేసు ఎవరినీ అనుకరించనక్కరలేదు. ఎవరైనా క్రీస్తునందు ఆయన స్వభావంలో పాలుపొందటమే భక్తి!

### మార్పులేని దేవుడు

దివ్యజ్ఞానం కావాలని మతాలు కోరుతాయి. తపస్సు చేస్తాయి. అయితే మానవుడు దేవుని అనేక రూపాలలోకి ఊహించుకుంటాడు. అనేకమంది దేవుళ్ళను ఊహించుకొని ఏ దేవుడు గొప్పదేవుడుని పోల్చుకుంటారు. తను

దేవుళ్ళను గెలిపించుకోటానికి మత యుద్ధాలు చేస్తారు. యేసు క్రీస్తునందు మతాలన్నీ రద్దయిపోయాయి. మతపు దేవుళ్లు ఇప్పుడు లేరు. హెబ్రీ 13:8 చెబుతుంది 'యేసుక్రీస్తు మార్పులేని దేవుడు. ఆయన మనుషులను మారుస్తాడు కాని తాను మారడు. మార్పు అంటే కన్వర్షన్. ఇది మతమార్పిడి కాదు. దేవుళ్ళ మార్పిడి కాదు. యేసు విశ్వాసుల్లో యెడతెగక కలిగించే మార్పు.

## యేసులాగా..

కొందరు ప్రశ్న అడుగుతారు 'ఈ క్రైస్తవులు క్రీస్తులాగా లేరు ఎందుకని? ఆ ప్రశ్నకు జవాబు ఎవరు చెప్పాలి? క్రీస్తులాగా ఉండగలరు.కాని ఉండరు. దానికి బాధ్యత, వ్యక్తిగతంగా బలహీన క్రైస్తవులే వహించాలి. క్రీస్తును పోలి జీవించటం అంటే ఈ క్రీస్తే మన గరిష్టప్రమాణం! మానవత క్రీస్తునందే సాఫల్యత చెందగలదు. యేసుక్రీస్తు పిలుస్తున్నాడు. నన్ను వెంబడించండి, అని ఆహ్వానిస్తున్నాడు. అనగా ఆయనను పోలి జీవించటంలో మనం పురోగతి సాధించాలి అని అర్థం! ఆయనను వెంబడించటానికి ఎవరూ సిగ్గుపడనక్కరలేదు. దేవుడంటే మనం పూజించడానికేనా! ఆయనలాగా ఉండటానికి వీలు కాదా? అలాంటి దేవుళ్ళు మానవులకు ఎందుకూ పనికిరారు. యేసు జీవితాన్ని గమనించండి! ఆయన ఏదో వేదాంతానికి సిద్ధాంతానికి పరిమితమైన వాడు కాదు. మానవుడి జీవితాన్ని క్షణక్షణమూ ప్రభావితం చేసే సజీవుడు. మనిషిలో ఉండి ఆ మనిషిని తన రూపానికి క్రమేణా మార్చే దేవుడు. ఇదే విశ్వాసిలో పరిశుద్ధాత్మ చేస్తున్న పరిచర్య! యేసు యొక్క నైతిక శీలం. ఆయన ఆధ్యాత్మిక ప్రమాణాలు ఉన్నతమైనవి. అవి పరాకాష్ట బిందువును సూచిస్తాయి. యేసును నమ్మినవాడు తనకు తెలియకుండానే తాను నమ్మిన యేసు పోలికకు పరిశుద్ధాత్మ ద్వారా మార్చబడుతూ ఉంటాడు. అందుకే యేసు అన్నాడు 'నేనే మార్గము' మానవ జీవిత విధానం యేసు మార్గానికి సరిపడేటట్లు ప్రవర్తిల్లాలి.

## మంచి మనస్సాక్షి

ప్రతిమనిషిలో మనస్సాక్షి ఉంది. మనస్సాక్షి ఎప్పుడూ నిజమే చెబుతుంది. అది దేవుడు మోగించే అలారం! దానిని నీవు వినకుండా, అది నీకు వినపడకుండా సైతాను అడ్డపడతాడు. గమనించాలి! మనస్సాక్షి దేవుడు కాదు. మనస్సాక్షి ద్వారా దేవుడు మాట్లాడతాడు. ఏ మతానికీ చెందని వారిలో కూడా, నాస్తికులలో కూడా మనస్సాక్షి పని చేస్తుంది. మనస్సాక్షి యేసు ఆధీనంలో ఉంటే మంచిది. యేసుక్రీస్తు మన మనస్సాక్షిని సుశిక్షితం చేస్తాడు. ఆయన మన శరీరాన్ని జీవాన్ని మనసును హృదయాన్ని మనస్సాక్షిని తన పవిత్ర రక్తంతో శుద్ధి చేసినపుడు మన అంతరంగ జీవితం సజావుగా నడుస్తుంది. విశ్వాసిలో శాంతి పరిపాలిస్తుంది.

## మంచి-చెడుల పోరాటం

క్రైస్తవభక్తి వ్యాయామం కాదు కసరత్తు కాదు, దేవుని కృపా ప్రసాదం. యాకోబు పత్రికలో భక్తుడు చెప్పినట్లు మనలోనే ఒక ప్రచ్ఛన్న పోరాటం, యుద్ధం జరుగుతూ ఉన్నది. మంచి చేయాలనే కోరిక అది చెయ్యటానికి సామర్థ్యం. ఈ రెండిటి మధ్య పోరాటం. మంచి ఏదో తెలుసు, అది చేస్తే విజేత అవుతాడు. లేకపోతే ఓడిపోతాడు. యేసు ప్రభువును ఎందుకు సిలువ వేశారు? ఆయనలో చెడు అనేది మచ్చుకు కూడా కానరాదు. అందుకే పాపులకు ఆయనంటే పడదు. ఆయన్ను సిలువ వేశారు. పిలాతు యేసును ఎందుకు విడుదల చేయలేకపోయాడు? దానికి ఒకే ఒక కారణం. మనిషికి మంచి చేసే శక్తి లేదు. అథవా మంచి చేసినా అది చెడు ఉద్దేశంతో చేస్తాడు. యేసును తీర్పు తీర్చిందెవరు? పాపులయిన మనుష్యులందరూ!

## క్రైస్తవ యాత్ర

యేసుప్రభువు ఒక సందర్భంలో అన్నాడు "లోకంలో మీకు శ్రమ కలుగుతుంది. కాని నా యందు మీకు శాంతి లభిస్తుంది. నేను లోకాన్ని జయించి ఉన్నాను." నేను ఇంతకూ చెపేదేమిటంటే క్రీస్తునందు క్రైస్తవుడు మాత్రమే స్వేచ్ఛగా, స్వచ్ఛందగా కల్తీలేని మంచి చేయగలడు. అతనికి ఆ స్వేచ్ఛ ఉంది. గమ్యంలేని బతుకు ఘోరమైనది. క్రీస్తు మన గమ్యాన్ని వేలుపెట్టి చూపుతున్నాడు. నా వెంబడి రండి. నేను మిమ్ములను సురక్షితంగా గమ్యం చేర్పిస్తాను. మన జీవితం ముందుకు కదలిపోవాల్సిన ప్రయాణం. ముందుకు ప్రవహించే ప్రవాహం! పరలోకం వైపు కొనసాగే యాత్ర! క్రీస్తునందు స్వార్థానికి తావులేదు. పరార్థమే మన పరమార్థం. క్రీస్తునందు, క్రీస్తుకొరకు, క్రీస్తుతో - మన ప్రయాణం. వెనక్కుచూడదు. పరలోకం మనకు కనుచూపు మేరలో ఉంది. క్రైస్తవ యాత్రలో అడుగడుగునా ఆశ్చర్యమే, సాహసమే! యేసులో క్రైస్తవ బ్రతుకు ఏమాత్రమూ బోరు కొట్టదు.

# రాజైన యేసుక్రీస్తు రాకడ



*"ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు. ప్రతి నేత్రము ఆయనను చూచును, ఆయనను పొడిచిన వారును చూచెదరు, భూజనులందరు ఆయనను చూచి రొమ్ము కొట్టుకొందురు, అవును ఆమేన్" ప్రకటన 1:7.*

*"ఇదిగో త్వరగా వచ్చుచున్నాను. వానివాని క్రియ చొప్పున ప్రతివాని కిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద వున్నది." ప్రకటన 22:12.*

**దేవుని** సృష్టికి సంబంధించి, దేవుని ప్రణాళికలో ప్రభువైన యేసుక్రీస్తు రెండవ రాడక గొప్ప సంఘటన. అందులో దేవుని రాజ్యపు యుగం ప్రారంభమవుతుంది, రాజ్యం తెలియజేయబడుతుంది. అంతేకాదు అది భూమి మీద ప్రారంభించబడుతుంది. క్రీస్తు రాజులకు రాజుగా, ప్రభువులకు ప్రభువుగా

అది రాజులకు రాజుగా ప్రభువులకు ప్రభువుగా క్రీస్తుకు పట్టము కట్టు దినము. ఇశ్రాయేలీయులకు అది శ్రమ కాలము మరియు రక్షణ సమయం. అది సంఘము గొర్రెపిల్ల వధువుగా మహిమ పర్చబడి క్రీస్తుతో ఐక్యపర్చబడు దినం. ఈ లోక రాజ్యములు మరియు వాటి ప్రభుత్వములు అంతమయ్యే దినం. యుగసమాప్తికి సంబంధించి అనేక ముఖ్య సంఘటనలు జరుగుతాయి.

రాజ్యమునకు సంబంధించిన దేవుని ప్రణాళికలో ప్రభువు రాకడ పాత్రను గూర్చి మనము ధ్యానిద్దాము. రాజు లేకుండ, ప్రపంచమంతటికి ఒకే రాజ్యముండుటను గూర్చి మనం ఆలోచించలేము. దేవుడు ఏర్పరచిన రాజుగా యేసుక్రీస్తు ప్రత్యక్ష మగుటకు కేంద్రముగా నుంచుకొని యుగసమాప్తికి సంబంధించిన సంఘటన జరుగుతుంది.

## 1. యేసుక్రీస్తు వ్యక్తిగతముగా వచ్చుట

### 1. ఆయన ప్రత్యక్షమగుటను గూర్చిన శుభ నిరీక్షణ.

ఆయన మరల వచ్చి వారిని తనయొద్దకు తీసికొని వెళ్ళుదునని మన ప్రభువైన యేసుక్రీస్తు తనవారితో స్పష్టముగా చెప్పాడు. యోహాను 14:1-3; ప్రకటన 22:12 ఆయన తాను తిరిగి వచ్చే సమయం కొరకు అత్యాశతో ఎదురుచూచాడు. మత్తయి26:29; యోహాను 14:18. ఆయన వ్యక్తిగతమైన రాకడ విశ్వాసము మరియు ప్రేమ ద్వారా ఆయనతో ఐక్యపర్చబడిన ప్రతి వ్యక్తి యొక్క శుభప్రదమైన నిరీక్షణయై యున్నది. తీతు 2:13-14. 2 తిమోతి 4:8. అది సంఘము ఎదురుచూచుచున్న మకుటాయమానమైన సంఘటన. ఎఫెసీ 5:27.

### 2. ఆయన తిరిగి వచ్చుటను గూర్చిన నిశ్చయత

యేసుక్రీస్తు ఈ భూమి మీదకి నిశ్చయముగా తిరిగి వచ్చుటను గూర్చి తరచుగా మరియు వివరముగా బైబిలు నందు చెప్పబడిన విధముగా మరియే యితర సంఘటనను గూర్చి చెప్పబడలేదు. మత్తయి 24:30,42; యోహాను 21:22; కార్య 3:19-20; హెబ్రీ 9:28; 1యోహాను 2:28; ప్రకటన 22:20 క్రీస్తు రాకడను గూర్చి లేఖనములో 314 మార్లు చెప్పబడినట్లు వాక్యమును పరిశోధించిన వారు లెక్కించారు.

### 3. క్రీస్తు వచ్చు విధము

ఒక వ్యక్తిగా యేసుక్రీస్తు ఈ లోకములోనికి

వచ్చాడు. మరల ఆయన ఆరోహణుడై తండ్రి యొద్దకు దృశ్యమైన వ్యక్తిగా తిరిగి వెళ్ళాడు. దృశ్యమైన రీతిలో ఒక వ్యక్తిగా ఆయన మరల వస్తాడు. అ.కార్య 1:11; ప్రకటన 1:7 ఆయన ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశ మేఘారూడుడై వచ్చును. మత్తయి 24:30; 25:31; 1థెస్స 4:16-17. ఆయన అగ్ని జ్వాలలలో తన తండ్రి మహిమలో మరియు పరిశుద్ధ దూతల సమూహముతో ప్రత్యక్షమగును. ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును. 2థెస్స 1:7; మత్తయి 26:54; 16:27; మార్కు 8:38; 1థెస్స 4:16.

ఆయన అకస్మాత్తుగా, అనుకోనిరీతిగా, హెచ్చరిక లేకుండా ప్రత్యక్షమగును. రాత్రివేళ దొంగవలె ఆయన వచ్చును. మత్తయి 24:44; లూకా 17:26-30; 21:34-35; 1థెస్స5:2, 2పేతురు 3:10; ప్రకటన 16:15.

### 4. యేసుక్రీస్తు రాకడ యొక్క ప్రాముఖ్యత

యేసుక్రీస్తు రాకడ కేవలము ఒక సంఘటన మాత్రమే కాదు. దానితో ఒక నూతన యుగము ప్రారంభమవుతుంది. దేవుడు తాను సృష్టించిన మనుష్యులపట్ల మరియు ఈ భౌతిక సృష్టిపట్ల తాను సంకల్పించినవి జరుగుతాయి. అది కొంత కాలమునకు మరియు కొన్ని దశలకు సంబంధించి జరుగుతాయి. కొన్ని రీతులుగా అది ప్రాముఖ్యత వహిస్తుంది.

ఎ) దేవునికి సంబంధించి మహిమా ప్రభావముతో, అనంతమైన జ్ఞానముతో, పరిపూర్ణ నీతి న్యాయముతో ఆయన బయలుపర్చబడతాడు. సర్వసృష్టి యెదుట ఆయన న్యాయవంతుడుగా ఉంటాడు. యెషయా 40:3-5; 9-11; ఆది 18:25, కీర్తన 97:1-6; రోమా 11:33-36. కొరింధి 15:28; ప్రకటన 4:8-11.

బి) తాను మొదట వచ్చినప్పుడు తృణీకరింపబడి, విసర్జింపబడి, వధింపబడిన యేసుక్రీస్తు ఈ పర్యాయము ఘనపర్చబడతాడు, మహిపర్చబడతాడు. ప్రతి నామముకంటె పై నామము ఆయన పొందుకుంటాడు, రాజులకు రాజై పాలించుటకు ఆయన వస్తున్నాడు. యెషయా 53:3-5, 7-9, ఫిలిప్పీ 2:9-11; 2థెస్స 1:10 ప్రకటన 5:9-13; 12:10; 19:15-16.

సి) పరిశుద్ధాత్మ విషయంలో, క్రీస్తు రాకడతో ఈ యుగములో తాను నేర్పవలసిన పని పూర్తి అవుతుంది. క్రీస్తును మహిమ పరచడానికి ఆయన వచ్చాడు. యోహాను 16:14.. క్రీస్తు రాకడ తర్వాత పరిశుద్ధాత్మ వెనకకు తీసుకొనబడతాడు. 2థెస్స 2:7-8.

డి) ఇశ్రాయేలీయులకు సంబంధించి ప్రభువు రాకడ ప్రాముఖ్యతను వహింస్తుంది. వారు తాము పొడిచిన వానిని చూతురు. జెకర్యా 12:10-14, వారు మారుమనస్సు పొంది. పాపక్షమాపణ నొంది పరిశుద్ధపర్చబడుదురు, జెకర్యా 13:1-2. ఆయా దేశముల నుండి వారు సమకూర్చబడుదురు. తమ దేశమునకు తేబడుదురు మరియు వారు ఏకజనమగుదురు. యెషయా 11:11-12, యిర్మియా 3:14-18; యెహెజ్కేలు 37:11-14. అప్పుడు ఇశ్రాయేలు జనులు రక్షింపబడుదురు. రోమా 11:26; యిర్మియా 23:5-6; యెహెజ్కేలు 37:23.

ఇ) యేసుక్రీస్తు సంఘమునకు సంబంధించి సంఘము పూర్తిచేయబడును, పైకెత్తబడును, విమర్శింపబడును మరియు మహిమపర్చబడును.

ఎఫ్) దేశములు మరియు తిరిగి జన్మించని వారి విషయములో చెప్పవలసిన దేమనగా, ఆయన వచ్చునప్పుడు భూమి మీదనున్న సకల వంశములు ప్రభువునుచూచి రొమ్ము కొట్టుకొందురని లేఖనము బయలుపర్చుచున్నది. మత్తయి 24:30; ప్రకటన 1:7. మనుష్యునికి గొప్ప భయము ఆవరించును. ప్రకటన 6:15-17. సమస్త జనములు ఆయన యెదుట పోగుచేయబడి తీర్పునొందును. మత్తయి 25:31-46

జి) సైతాను రాజ్యము విషయములో క్రీస్తు తిరిగి వచ్చునప్పుడు జరిగే అంత్య తీర్పులో ఈ రాజ్యము నాశనము చేయబడుతుంది.

### 2. మన ప్రభువు రాకడకు సంబంధించిన సంఘటనలు

మన ప్రభువు ప్రత్యక్షతకు సంబంధించి గొప్ప

ప్రాముఖ్యతగల అనేక సంఘటనలు జరుగునని దేవుని వాక్యము బయలుపర్చుచున్నది. కొన్నిటిని గూర్చి మనము క్లుప్తముగా ధ్యానిద్దాము.

1. సంఘము పైకెత్తబడి ఆకాశమండల మందున్న ఆయన యొద్దకు చేర్చబడుతుంది. క్రీస్తు రాకడ సమయములో ఇది మొదటిగా జరుగు సంఘటన. 1థెస్స 4:15-17. రెండు దశలను మనం ఇక్కట గమనించాలి. క్రీస్తు తన సంఘము నిమిత్తము వచ్చుట మరియు తన ప్రత్యక్షత సమయములో క్రీస్తు భూమి మీదికి తన సంఘముతో కూడ వచ్చుట. ప్రకటన 19:11-14.

2. యేడేండ్ల వరకు భూమి మీద మహాశ్రమ కలుగుతుంది. అట్టి శ్రమ మునుపెన్నడు కలుగలేదు. మత్తయి 24:21-22.

3. సైతాను పరలోకము నుండి భూమి మీదికి పడద్రోయబడును. క్రీస్తు విరోధి బయలుపర్చబడును మరియు ఇంతకుముందెన్నడు లేనంతగా సైతానీయ శక్తులు బయలుపడును. ప్రకటన 12:7-12.

4. కఠినబాధ పొందుచూ ఇశ్రాయేలీయులు కొంతకాలము గడుపుతారు, పిదప మారుమనస్సు పొందుకుంటారు, సమకూర్చబడతారు, రక్షింపబడతారు మరియు క్రీస్తుకు సాక్షులుగా ఉంటారు. జెకర్యా 8:20-23.

5. ప్రపంచములోని దేశములన్నియు క్రీస్తు విరోధి అధికారము క్రిందికి వస్తాయి. హార్ మెగిద్దోను అను యుద్ధములో తమ అంతిమ ఓటమిని పొందును. ప్రకటన 16:12-16.

6. దేవుని కుమారుడు మరియు మనుష్య కుమారుడునైన యేసుక్రీస్తు మహిమలో బయలుపర్చబడతాడు. ఆయన జనములకు తీర్పుతీర్చి తన వెయ్యేండ్ల రాజ్యమును స్థాపిస్తాడు. మత్తయి 24:30-31; 25:31-46. ప్రకటన 20:46.

7. ధవళమైన మహా సింహాసనము యెదుట అంతిమ తీర్పు జరుగుతుంది. మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలుస్తారు. సృష్టింపబడిన ప్రతివ్యక్తి క్రీస్తు ద్వారా తీర్పు పొందుతారు. ప్రకటన 20:11-15.

8. ఇప్పుడున్న ఆకాశము భూమి గతించి పోతాయి. క్రొత్త ఆకాశమును క్రొత్త భూమని దేవుడు సృజిస్తాడు. విమోచింపబడిన వారందరు తమ నిత్యస్థితిలో ప్రవేశిస్తారు. ప్రకటన 21 మరియు 22వ అధ్యాయము.

## దయచేసి సహకరించండి

**1) పాఠకులకు అప్పుడప్పుడు యం.ఓ ఫారంలు పంపిస్తున్నాము. ఈ పరిచర్య కోసం ప్రార్థించండి. మీ చందాలు, కానుకలు పంపటానికి యం.ఓ ఫారంను ఉపయోగించండి**

**2) యం.ఓ ఫారంలో మీ పూర్తి పోస్టలు అడ్రసు రాయండి. మరువకండి.**

**3) స్పందన అడ్రసులు కంప్యూటరు సాఫ్ట్‌వేర్ అవసరత ఉంది. ప్రార్థించండి.**

**4) మీ ప్రతి యం.ఓ లో, ఉత్తరంలో మీ మొబైల్ నంబరు రాయటం మరువకండి.**

**5) మీ ఉత్తర ప్రత్యుత్తరాలలో తప్పక మీ కోడ్ నంబరు వేయండి.**

మీ కోడ్ నంబరు

KR 628 PATRON
THOTA VENKATESWARA RAO,
S/O.T.RADHA KRISHNA,
IBRAHIMPATNAM (FERRY),
KRISHNA DIST - 521 456.

## జులై గ.ను.క ఆల్ కరెక్టు వ్రాసినవారి పేర్లు

పి.గ్రేషియస్-పెదవేగి, జి.యస్.సునీతరావు-బద్వేల్, వి.యల్.ప్రసూనాంబ-గుంటుపల్లి, అర్.జయమ్మలాబాను-గుంతకల్లు, బి.చంద్రలీల-మదనపల్లి, యం.నిర్మలసుదీప్‌రెడ్డి-కొండపల్లి, సంపతీపీటర్-పర్చాల, కె.మేరిపుష్పలత-ఏలూరు, జి.కె.యల్.సుగుణమ్మ-బద్వేల్, బి.యన్.హేమలతపాల్-మదనపల్లి, బి.నరోజిని-గుంతకల్లు, కె.ప్రేమరూతు-గుంటూరు, జి.నిర్మలదేవదానం-గుంటూరు, యం.సి.మనోహరమ్మ-అనంతపూర్, కె.శెశీల్య, వై.మాణిక్యం, వై.ఎస్తేరమ్మ-కంచికచర్ల, బి.సుగుణమ్మ-కావలి, వై.పి.మేరి ప్రమీల-హిందుపూరం, కే.విమల-కొత్తవలస, సి.హెచ్.కాసేంబీ-చీరాల, యస్.రూతు ఆమోసు-కనిగిరి, జి.భారతిఆంధ్రూస్-చింతకుంట, భారతిదేవప్రియం-కడప, టి.శోభరాణి, కె.కనకమ్మ-హన్మకొండ, బి.దేవభూషణం-గుత్తి, యమ్.రోజమ్మ-కడప, టి.శాంతరత్నం-ఏలూరు, ఆర్.యమ్.విజయకుమారి-మదనపల్లి, జి.పాల్-కలసపాడు, కె.వి.రత్నం-హన్మకొండ, ఎ.కె.జయమ్మ -అనంతపూర్, డి.సుందరాజన్-కుప్పం, సుశీల మనోహర్‌రాజ్-నంద్యాల, హెచ్.సరళమ్మ-గిద్దలూరు, యం.రత్నకుమారి-అమ్మిరెడ్డిగూడెం, వై.నిరీక్షణకుమార్-ఇనమనమెల్లూరు, యన్.చంద్రప్రభ-సింగరాయకొండ, జి.ఎస్తేరు-అచ్చంపేట, జె.శ్యామల-గుంటూరు, దీనమ్మక్రిష్టఫర్-హన్మకొండ, టి.యమ్.సుగుణ-వరంగల్, యన్.సత్యన్నారాయణ-విశాఖపట్నం, అర్.ఆదిత్య-మోదుకూరు, మెర్సిలారెన్స్-కాకినాడ, పి.హిల్డామార్గరెట్-నెల్లూరు, పి.నయోమి-బెంగుళూరు, యమ్.మనితాప్రభాకర్-నంధ్యాల, బి.ఆనీమేరి-హైదరాబాదు, బి.ఆశీర్వాదం, జి.పద్మరాజు -కాకినాడ, జె.స్వామినాధన్-కుప్పం, జేన్‌ఆనంద్-డోన్, యస్.ఎఫ్.కస్తూరిబాయి-మదనపల్లి, జె.సరోజిని-రాజమండ్రి, వి.భాగ్యలక్ష్మి-విశాఖపట్నం, ప్రభావతి ఇశ్రాయేల్-మదనపల్లి, మార్తాయేసుదాను-జమ్మలమడుగు, యమ్.రఘానీశాంతకుమారి-హన్మకొండ, ఎన్.అరుణకుమారి-గిద్దలూరు, వి.జడ్సన్-అమీనాపురం, ఎస్.జాషువామాథ్యూస్-ఒంగోలు, జె.ప్రభాకర్‌రావు-నిమ్మకూరు, కె.నలోమిమార్టిన్స్-బీమవరం, బి.మణిజయప్రకాష్ -అమ్మిరెడ్డిగూడెం, జి.రిబ్కెమ్మ-కలసపాడు, రమణమ్మసోమయ్య-అనంతపురం, పి.ఎలిజబెత్‌రాణి-గుంతకల్, కె.కృపానందం-చెన్నై, డి.డి.డి.ఎ.మణి-విశాఖపట్నం, కె.విమల-హైదరాబాదు, ఎ.మునిరాజు-కడప.

**ఒక తప్పుతో వ్రాసిన వారు**-జె.పి.దాసు-హైదరాబాదు, కె.జె.మార్గరెట్‌పద్మకర్-గుత్తి, దేవకుటుంబరావు-విశాఖపట్నం, ఆలూరినవమ్మ-పొదిలి, పి.దేవదానం-నంధ్యాల, జె.ప్రసాద్‌రావు-రంపయర్రపాలెం, వి.కె.విజయసుధ-గిద్దలూరు, యన్.యస్.యస్.పాల్-452, బి.అంబుజ-వరంగల్, యు.యస్.పురుషోత్తం -ప్రొద్దుటూరు.

## ఈ మాసపు పాట

# విజయ పతాక

- ఆచార్య ఆరోన్కే

మార్పులేని యేసు
నన్ను మారుస్తున్నాడు
నన్ను మార్చే మార్పు
నాలో ఉన్నది
నాకింకేం కావాలి.

నా బతుకే సజీవ యాగం
నా హృదిలో ప్రేమయోగం
సిలువే నా విజయపతాక
యేసురక్తం విమోచన ప్రతీక

ఆరోహణుడైన యేసు
సింహాసనాసీనుడు
ఆయన ప్రక్కనే నాస్థానం
రానున్నది మహా ప్రసాద్ధం.

## జులై గ.ను.క జవాబులు

**అడ్డం ▪**

1. దేవుడు 2. లెబానోను 3. పువ్వు 6. ముసుకు 9. పిట్టలు 10. పూర్వులు 11. కోపము 14. మూత 15. తలుపు 20. మ్రొక్కు 22. స్వరమును 23. శీఘ్రము 24. మునుపు

**నిలువు ▪**

1. దేహము 2. లెస్స 3. పుట్ట 4. త్రవ్వు 6. ముద్దు 7. కుప్ప 8. ములుకో 9. పిల్లలు 11. కోరిన 12. పట్టాభిషేకము 13. శ్రమ 14. మూడు 16. పుచ్చుకొనుట 17. దిక్కు 18. లాభము 19. శిరస్సు 24. వ్యాఘ్రము

## బాలస్పందన

# గద్దింపు



పిల్లలూ మీరంతా మీ తల్లిదండ్రులు, పెద్దలు, దైవసేవకులు చెప్పిన మాట వింటున్నారా!

ఒక తల్లి తన కుమారిన్ని పిలుస్తూ అంటుంది "ఒకటి! త్వరగా రావాలి. రెండు! త్వరగా." మూడు అనే లోపూ తన కుమారుడు వచ్చేసాడు. మూడు కూడా లెక్కపెడితే తన తల్లి చేతిలో తన్నులు తప్పవని తెలుసు ఆ పిల్లవాడికి. దేవుని దగ్గర కూడా మనం ఆయన పిలవగానే ఆయన మాట వినాలి. లేకపోతే దేవుడు మనల్ను శిక్షిస్తాడు. ఇప్పుడు ఒక కథ వినండి.

ఆఫ్రికాలో పెద్ద పెద్ద చెరువులుంటాయి. వాటిలో నీటి గుర్రాలు, మొసళ్లు, పలురకాల చేపలు వుంటాయి. అంతేగాక కొన్ని చిన్న చిన్న చేపలు కూడా మందల్లా చెరువు గట్ల వెంబడి తిరుగుతూ వుంటాయి. అవి చిన్నవైనా రుచిగా వుంటాయి. ఆ చెరువు సమీపంలో ఉన్న గ్రామాల్లోని కొందరు, ఇంకా పిల్లలు వాటిని పొడవైన పంచె లేక వోణితో పట్టి ఇంటికి తీసుకు వెళ్ళి కూర చేసుకొనే వారు.

అటువంటి ఒక చెరువు గట్టున ఒక పల్లెటూరుంది. ఆ ఊళ్లో ఒక మిషనరీ దంపతులు సేవ చేస్తున్నారు. వారికి ఒక ప్రార్థనా మందిరము కూడా ఉంది. ఒక పాష్టరుగారు అందులో దేవుని వాక్యం బోధిస్తుంటారు.

ఒక ఆదివారం ఉదయం ఆ గ్రామంలోని పిల్లలంతా సండేస్కూలుకు, తరువాత జరిగే కూటానికి వెళ్ళేసమయంలో కొంచెం పెద్దవయస్సు గల మార్త అనే అమ్మాయి తనతోటి పిల్లల్ని యీ చిన్న చేపల్ని పట్టడానికి పిలిచింది. ఈ మార్తకు పాష్టర్ గారు ఎన్నో సార్లు ఆ దారిలో వెళ్తూ అది ప్రమాదకరమైనదని, పైగా మందిరానికి రాకుండా ఆ సమయంలో ఇటువంటి పనులు అస్సలు మంచివి కావని హెచ్చరించారు. అయినా మార్త ఎవరి మాట పెద్దగా వినేదికాదు. ఇంకా అనేకమందిని తన సహవాసానికి బలవంతగా చేర్చుకొనేది.

వారంతా సండేస్కూలు, కూటము ఎగగొట్టి చేపలు పడుతున్నారు. ఆ రోజు చేపలు కూడా బాగా దొరుకుతున్నాయి.

మార్త, తన స్నేహితుల సంతోషానికి పట్టపగ్గాలు లేవు.

ఇంతలో నండేన్కాలు అయిపోయింది. ఇక కూటం సమయం కావస్తుంది. అక్కడున్న మిషనరీగారు మందిరానికి అదే దారిన వెళ్తూ చేపల వేటలో మునిగి, మురిసి పోతున్న మార్తను, ఆమె అనుచరులను చూచి "అయ్యో దేవుని సన్నిధి మాని, మీరు చేపలు పడుతున్నారా, ఎంత తప్పు, లేచిరండి, సమయంలేదు, రండి" అని పిలిచారు.

వెంటనే మార్త "వస్తున్నామండి వస్తున్నాం" అని గట్టెక్కింది. ఒకటి రెండు అడుగులు మెల్లగా ఆయన వెనుకగా వేస్తూ వెళ్ళారు. గాని, ఆయన మలుపు తిరిగి చెట్ల చాటుకు పోగానే, పెద్ద నవ్వుతో మరలా చేపలు పట్టడానికి వెనక్కి వచ్చి చెరువులోకి దూకింది మార్త.

మరి కొంతసేపటికి ఆ మిషనరీగారి భార్య కూడా కూటానికి పోతూ, మార్తను పిల్లన్ని చూచి మిషనరీగారిలాగే మందలించారు. మార్త, ఆమె చూస్తుండగా "వస్తున్నామండి ఇదిగో వచ్చేస్తున్నాం" అంటూ గట్టెక్కి ఆమె చాటుకు వెళ్ళగానే మరలా పెద్దగా నవ్వుతూ వారిని ఎగతాళి చేస్తూ నీటిలో మునిగి చేపలు పట్టుతుంది. పిల్లలంతా ఆమెతో నవ్వుతున్నారు. కొంత సేపటికి పాస్టరుగారు వెళ్తూ "అయ్యయ్యో! మార్త! నీవు పెద్దదానవు, నీవు తప్పుచేస్తూ చిన్న వాళ్ళను కూడా దైవ సన్నిధినుండి దూరం చేస్తున్నావా? ఇప్పుడే రండి, కూటానికి" అని గద్దించారు.

మార్త మరల "వచ్చేశానండి" అంటూ గట్టెక్కింది. గాని ఆయన మలుపుతిరిగాక మహా సంతోషంతో నవ్వుతూ వెనుకగా ఆయనను ఎగతాళి చేస్తూ గంతులేస్తూ మరలా దూకింది చేపలు పట్టడానికి.

గాని, ఈసారి ఒక పెద్ద మొసలి వచ్చి ఆమె కాలు పట్టింది. మార్త "అమ్మోయ్ నన్ను మొసలి పట్టుకుంది" అనగానే మిగతా పిల్లలంతా గట్టెక్కేశారు. కొందరు వెంటనే వెళ్ళి మార్త తల్లిదండ్రులకు చెప్పారు.

వెంటనే మార్త తండ్రి పరుగు పరుగునవచ్చి చెరువులో దూకి భయముతో, భాదతో వణికిపోతున్న మార్తను గట్టిగా పట్టుకొన్నాడు. అతణ్ణి మార్త తల్లి గట్టిగా పట్టుకొంది. మిగతా పిల్లలంతా ఆమెను పట్టుకొన్నారు.

మొసలికి నీటిలో ఎంతో బలం వుంటుంది. ఏనుగును కూడా కదలనియ్యదు గదా.

మొసలి మార్తను ఒక్క వూపున లాక్కొని లోతుకు తీసుకుపోయింది. అందరూ చూస్తుండగా, మార్త తన రెండు చేతులూ సహాయము కొరకు పైకి చాపుతూ, అమ్మా, నాన్న అంటూ, గిజగిజ కొట్టుకొంటూ క్షణాల్లో మునిగి పోయింది.

సరి, అప్పటికి మందిరంలో కీర్తనలు పాడారు. ప్రార్థనలూ ముగిశాయ్. పాస్టర్‌గారు ప్రసంగము చేయుటకు నిలబడి, ఆ దినమునకు మూల వాక్యంగా,

సామెతలు 29:1 చదివారు.

**"ఎన్నిసార్లు గద్దించినను లోబడనివాడు మరి తిరుగు లేకుండ హఠాత్తుగా నాశనమగును"**

**'చిన్నారి స్పందన'**

**బాలల త్రైమాస పత్రిక/టి.వి. కార్యక్రమాలు బాలల ఆధ్యాత్మిక క్షేమం, వికాసం కోసం మూడునెలలు కొకసారి ప్రచురించబడే 'చిన్నారి స్పందన' పత్రిక కోసం ప్రార్థించ మనవి.**

**'స్పందన'**

**అలాగే మన టి.వి కార్యక్రమాల్లో ప్రతిమొదటి వారం శుభవార్త ఆరాధన ఛానళ్ళలో వీక్షించండి. ఈ ప్రత్యేక పరిచర్య కోసం ప్రార్థించ మనవి.**

**- ఎడిటర్**



# బైబిల్‌లోని పేర్లు వాటి అర్థాలు

**ఆఫెకు, అపెకు, అఫెకు** = బలము లేదా ఆటంకము.

1) ఇశ్రాయేలీయులకియ్యబడిన కనానీయుల రాజధానులలో ఒకటి - యెహో 12:9-24; 1 సమూ 4:1; 29:1

2) కనాను ఉత్తర ప్రదేశమందు ఆషేరు గోత్రస్థానములోని ఒక పట్టణము - యెహో 13:4; 19:30; న్యాయా 1:31

3) రాజైన ఆహాబు సిరియనులను ఓడించిన ఒక పట్టణము - 1రాజు 20:26,30; 2 రాజు 13:17

**ఆబీబు** = అంకురించుట లేదా పచ్చని వెన్నులు. హెబ్రీయుల సంవత్సరమందలి మొదటినెల - నిర్గ 13:4; 23:15; 34:18; ద్వితీ 16:7

**ఆబేల్ మిస్రాయిము** = ఐగుప్తీయుల ప్రలాపస్థలము లేదా ఐగుప్తీయుల మైదానము. హెబ్రోను పట్టణమునకు సమీపమందలి ఒక గ్రామము. ఆది 50:11

**ఆబేల్మాయీము** = జలముల మైదానము. యూదారాజైన ఆసా యేలుబడిలో బెన్హదదు సైన్యములు కొల్లపెట్టిన ఒక పట్టణము - 2 దిన 16:4

**ఆబేలు** = ఆవిరి లేదా మైదానము. నఫ్తాలి గోత్రస్వాస్థ్యమందలి ఒక పట్టణము - 2 సమూ 20:14

**ఆబేలుషిత్తము** = తుమ్మచెట్ల మైదానము. మోయాబు లోయలలో యొర్దాను నదికి తూర్పున యెరికో పట్టణమునకు సమీపమైన ఒక స్థలము - సంఖ్యా 33:49

**ఆబేల్కెరామీము** = ద్రాక్షతోటల మైదానము. యొర్దాను నది తూర్పున ఉన్న ఒక స్థలము - న్యాయా 11:33

**ఆబేల్బేత్మయకా** = హింసపుయింటి మైదానము. మనష్షే గోత్రస్థానమందలి ఒక పట్టణము - 1 రాజు 15:20; 2రాజు 15:29

**ఆబేల్మెహోలా** = మత్స్యపులోయ లేదా నాట్యమాడు మైదానము. ప్రవక్తయైన ఎలీషాకు జన్మస్థానమే. ఇశ్రాయేలు గోత్రస్వాస్థ్యమందున్న ఒక పట్టణము - న్యాయా 7:22; 1 రాజు 4:12; 19:16

**ఆమాబు** = గుంపులుగా కూడినది లేదా అతుకబడినది. యూదా వంశస్థులలో ఒకడు - 1 దిన 4:8

**ఆమాలు** = కుటిల స్వభావము లేదా కష్టము. ఆషేరు వంశస్థులలో ఒకడు - 1 దిన 7:35

**ఆమీ, ఆమోను** = దాసుడు. బబులోనునుండి యెరూషలేమునకు వచ్చిన ఒక కుటుంబమునకు పితరుడును, రాజైన సొలొమోను ఏలుబడిలో ఆయన దాసులైనవారిలో ఒకడు - ఎజ్రా 2:57; నెహె 7:59

**ఆమేన్** = నిశ్చయము లేదా అట్లు జరుగును గాక. ఒక హెబ్రీయ పదము - సంఖ్యా 5:22; ద్వితీ 27:15,16,17,18,19,20,21,22, 23,24,25,26; 1 దిన 16:36; నెహె 8:6; కీర్త 41:13; 72:19; 89:52; 106:48; రోమా 1:25; 9:5; 11:36; 15:33; 16:25-27; 1 కొరి 14:16; 16:24; గల 1:5; 6:18; ఎఫె 3:21; ఫిలి 4:20; 1తిమో 1:17; 6:16; 2 తిమో 4:18; ఫిలే 1:25; హెబ్రీ 13:21,25; 1 పేతు 4:11; 5:11,14; 2 పేతు 3:18; యూదా 1:25; ప్రక 1:6,7; 3:14; 5:14; 7:11,12; 19:4; ప్రక 22:20,21

**ఆమోకు** = ఆగాధము లేదా లోతైనవాడు. నెహెమ్యా కాలమందలి యాజకులలో ఒకడు - నెహె 12:7,20

**ఆమోజు** = బలవంతుడు, ధైర్యశాలి. ప్రవక్తయైన యెషయా తండ్రి - 2 రాజు 19:2,20; 20:1; 2 దిన 26:22; 32:20,32; యెష 1:1; 2:1; 13:1; 20:2; 37:2,21; 38:1

**గమనిక** - ఈ వాక్య భాగాలు మీ బైబిలులో పెన్సిలుతో గుర్తించండి. అర్థాలు రాసుకోండి. వాక్యాన్ని మరింకా బాగా అర్థం చేసుకోవటానికి సాయపడతాయి.



## రేడియో పాఠం

ఆచార్య ఆరార్కే

# నిర్గమ కాండము



(గత సంచిక తరువాయి)

నిర్గమ-21అ

**జాతి పరంగా** ఇశ్రాయేలు హంతకులకు మరణ శిక్ష విధించి తీర్పు చెప్పవలసిందే. ఆశ్రయపురాలు ఆరు ఉన్నాయి. ఇవి పాలస్తీనా దేశమందు అన్ని దిక్కులలోను ఉన్నాయి. ఎవడైనా హత్య చేసి ఉంటే న్యాయస్థానంలో అతని వ్యాజ్యెం తీర్పు వచ్చే వరకు అతడు ఆశ్రయపురంలో ఉండవచ్చు. అధాటున తన చేతి దెబ్బకు ఎవడైన చస్తే ఆనాలోచితంగా ఎవరినైనా చంపితే దానికి శిక్ష ఉన్నది. అయితే ప్రాణ రక్షణకోసం ఎవరినైనా చంపితే అతనికి మరణ శిక్ష విధించబడదు. తల్లిదండ్రులను వారి పిల్లలు గౌరవించాలి. వారి క్షేమాన్ని గూర్చి శ్రద్ధ తీసుకోవాలి. దేవునికి బానిసత్వం అనేది ఇష్టం లేదు. దాన్ని దేవుడు అసహ్యించుకొంటాడు. అయితే ఆరోజుల్లో బానిసల వ్యాపారం ముమ్మరంగా జరుగుతుండేది. దేవుడు అట్టి స్థితిలో కఠిన చర్య తీసుకుంటాడు. ఇతరులను గాయపరిస్తే నష్టపరిహారం చెల్లించక తప్పదు. ఈ అధ్యాయంలోని నియమాలు కట్టడలు ఇవన్నీ మానవసమాజానికి వారిక్షేమమునకు భద్రతకు దేవుడు చేసిన ఏర్పాటు. సోదరీ! సోదరులారా చూసారా! ధర్మశాస్త్రవైఖరి ఎలాంటిదో గుర్తించండి. కంటికి కన్ను, పంటికి పన్ను.

ఇదంతా ఎందుకు? మనం చేసే ప్రతి పనికి ఏదో ఫలితం పుట్టుకొస్తుంది. బాధ్యత గల ప్రతి పౌరుడు తాను చేసే పనికి రాబోయే ఫలితాలను గురించి ఆలోచించాలి. కొన్ని కార్యాలు దీర్ఘకాలిక ఫలితాలు వస్తాయి. ఇతరులతో మనకున్న సంబంధాలు సమాధాన పూర్వకమైనవై ఉండాలి. మంచి ఫలితాలు వచ్చేట్లు చూడాలి. ఈ అధ్యాయమంతా పౌరుల క్రియలకు కారణాలు, ఫలితాలు ఎలా ఉంటాయో చెప్పబడ్డాయి. ఇతరులతో వ్యవహారించే టప్పుడు బాధ్యత నెరిగి న్యాయంగా ప్రవర్తించాలి. ఎవరికీ కీడు తలపెట్ట కూడదు. స్నేహితులైనా శత్రువులైన ఎవరికి కీడు కలగాలని కోరుకో కూడదు.

ఇశ్రాయేలీయులు బానిసత్వం నుండి విమోచింపబడి వచ్చారు. అయినా వారి దగ్గర పని చేసే బానిసలున్నారు. ఒకడు మరి ఒకనికి ఎందుకు బానిస అవుతాడు. దరిద్ర్యాన్ని బట్టే రుణబాధను బట్టి బానిసలౌతారు. లేదా నేరం చేసిన వాని చేత బానిస

చాకిరి చేయిస్తారు. అయితే హీబ్రూ ప్రజలకు బానిసల పట్ల ఉన్న వైఖరి ప్రశంసించదగింది. బానిస నీ ఆస్తి కాదు. అతడు ఒక మానవుడు గనుక వాడు మంచి పని చేసి విడుదల పొందవచ్చు. బైబిలులో బానిసత్వం ఉన్నది అని చెప్పబడింది గానీ ఈ బానిస వ్యవస్థను బైబిలు ఎప్పుడూ సమర్థించదు. అనుదిన జీవితంలో దేవుని ధర్మశాస్త్ర నియమాలు జీవప్రదములు ఆరోగ్యవంతమైనవి.

**భార్యభర్తలు**

10వచనం క్రొత్త నిబంధనలోని ఒక పరిస్థితిలో ఎలా వర్తిస్తుందో గమనించండి. 1 కొరింథీ 7:2-6. పౌలు అంటున్నాడు. జారత్వములు జరగుచున్నందున ప్రతి వానికి స్వంత భార్య ఉండాలి. ప్రతి స్త్రీకి సొంత భర్త ఉండాలి. భర్త భార్యకు, ఆలాగుననే భార్య భర్తకు వారి వారి ధర్మాలు నడపాలి. భర్తకే గాని భార్యకు తన దేహం పైన అధికారం లేదు. ఆలాగున భార్యకే గానీ భర్తకు తన దేహం పైన అధికారం లేదు. ప్రార్థన చేయటానికి మీకు సావకాశం కలుగటానికి కొంతకాలం వరకు ఉభయుల సమ్మతి చొప్పుననే తప్ప ఒకరినొకరు ఎడబాయకుడి. మీరు మనస్సు నిలుపలేకపోయినప్పుడు సైతాను మిమ్మును శోధించకుండునట్లు తిరిగి కలిసికొనండి. ఈ విషయంలో మనం పొందిన కృపావరం దేవుని వలన పొంది ఉన్నాం. భార్యభర్తల మధ్య పరస్పర అవాగాహన ఎంతో అవసరం. ఇందులో ఇద్దరిది సమానబాధ్యత. 16వ వచనంలో మనుష్యులను దొంగిలించే వాడు కఠిన శిక్షకు పాత్రుడు అవుతాడు. ఈ విషయాన్ని 1 తిమోతి 1:10 వచనంలో ధర్మశాస్త్రాన్ని గురించి పౌలు మాట్లాడుతు ధర్మశాస్త్రం మనకెంతో మేలు చేసింది అన్నాడు. చూడండి ధర్మశాస్త్రం ధర్మవిరోధులకు, అవిధేయులకు, భక్తిహీనులకు, అపవిత్రులకు, పాపిష్టులకు, మత దూషకులకు, పితృహంతకులకు, మాతృ హంతకులకు, నరహంత కులకు, పురుష సంయోగులకు, మనుష్య చోరులకు, అబద్ధికులకు అప్రమాణికులకు హితబోధకు విరోధియైన వాడు మరి ఎవడైన ఉండిన యెడల అట్టి వానికి నియమింపబడలేదు, అని ఎవడైన ఎరిగి, ధర్మానుకూలంగా దానిని ఉపయోగించిన ఎడల ధర్మశాస్త్రం మేలైనదని మనం ఎరుగుదుము.

**విశ్రాంతిదినం**

11వచనంలో సబ్బాతు దిన నియమమం పేర్కొనబడింది. మార్కు 2:27. ప్రభువు స్పష్టంగా చెప్పాడు. విశ్రాంతిదినము మనుష్యుల కొరకే నియమింపబడింది కానీ మనుష్యులు విశ్రాంతి దినం కోసం నియమింప బడలేదు. అందువలన మనుష్య కుమారుడు విశ్రాంతి దినానికి ప్రభువు. ఇది ఎంత చక్కని మాట. యేసుక్రీస్తు మనమేలు కోసము విశ్రాంతి దినాన్ని ఇచ్చాడు. విశ్రాంతి దినం మన ప్రభువు కాదు. యేసుక్రీస్తు విశ్రాంతి దినానికి ప్రభువు. ఈ విషయాన్ని పాఠకులు మరిచి పోకూడదు.

**తల్లిదండ్రులు**

12 వచనంలో తల్లిదండ్రులను సన్మానిస్తే బిడ్డలు దీర్ఘాయుష్మంతు లవుతారు అని రాయబడింది. మత్తయి 15:4. ప్రభువు అన్నాడు. తల్లి దండ్రులను ఘనపరచుమని తండ్రినైన తల్లినైనా దూషించేవాడు తప్పక మరణం పొందాలని దేవుడు సెలవిచ్చాడు. మీరైతే ఒకడు తన తండ్రినైనా, తల్లి నైనా చూచి నా వలన నీకేది ప్రయోజ నమో అది దేవార్పణం అని చెబితే చాలు అతడు తండ్రినైనా, తల్లినైనా ఘనపరచ నక్కరలేదు అని చెప్తున్నారు. మీరు మీ పారంపర్యాచారం నిమిత్తమై దేవుని వాక్యాన్ని నిరర్థకం చేస్తున్నారు. ఎఫెసీ 6:2 ఏమంటున్నదో చూడండి. నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని, తల్లిని సన్మానించు. అప్పుడు నీవు భూమి మీద దీర్ఘాయుష్మంతుడవౌతావు. ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది.

**నరహత్య**

ఈ అధ్యాయంలో 13వచనంలో హత్య చేయకూడదు అని ఆజ్ఞ. కొండ మీది ప్రసంగంలో మత్తయి 5:21,22 నరహత్య చేయవద్దు. నరహత్య చేసేవాడు విమర్శకు లోనౌతాడని పూర్వికులతో చెప్పబడిన మాట మీరు విన్నారు గదా ? నేను మీతో చెప్పున దేమనగా తన సహోదరుని మీద కోపపడే ప్రతివాడు విమర్శకు లోనౌతాడు. తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పేవాడు మహాసభకు లోనౌతాడు. ద్రోహీ అని చెప్పేవాడు. నరకాగ్నికి లోనౌతాడు.

(మిగతా వచ్చే సంచికలో)



# దీపాలు

జ్వలించే జీవవాక్కు చేత పట్టుకుని
జ్యోతిన్నై వెలుగనీ తామస లోకంలో
వెల్గుతూ ఉండనిమ్మన్నావు దీపాలు
పరమ తండ్రిని ప్రచురించాలన్నావు ప్రదీపాలు
నీ అమృత వాక్కుల్ని పఠించనీ
దేహానికి దీపాలైన నా కళ్ళు
వాక్కును స్వీకరించనీ ఈ వాకిళ్ళు
కుంచం తొలగించుకునే బలమివ్వు
దీపం చక్కబెట్టుకునే వరమివ్వు
జీవన స్తంభంపై నిల్చి వెలుగనీ ఆత్మదీపిక
తరుముకు వచ్చే చరమ కాలపు
ఝంఝా మారుతంలో
తుఫాను బీభత్సంలో
లోకానికి వెలుగైన క్రీస్తును
ప్రకటించే మిణుగురున్నై పరవశించనీ
నీ మహిమాగమనపు నిరీక్షణా
శీధువు నాస్వాదిస్తూ
కళ్ళు వత్తులు చేసుకుని
మెళుకువగా బ్రతకనీ
ప్రభూ! వెలుగనీ స్వామీ దీపాలు
స్వయంభూ! ప్రసరించనీ
దశ దిశల సువార్త మయూఖాలు.



డా॥ కొండెపోగు బి. డేవిడ్ లివింగ్‌స్టన్



ఆచార్య ఆరార్కె

# ప్రకటన గ్రంథ

## పరమ సత్యాలు



### ప్రకటన గ్రంథ ఉపోద్ఘాతము

ప్రియ సోదరీ సోదరులారా! ప్రకటన గ్రంథం ఉపోద్ఘాతాన్ని చూడబోతున్నాం. 22 అధ్యాయాలు గల ఈ గ్రంథం నుంచి మీరు 65 ప్రసంగాలు చదవబోతున్నారు. దేవుని వాక్య మంతటిలో ప్రకటన గ్రంథం అతి ముఖ్యమైనది, అతి శ్రేష్టమైనది. ఈ లోక చరిత్రకు పర్యవసానమేమిటో ప్రకటన గ్రంథం మనకు ప్రకటిస్తుంది. ఈ లోకమంతా ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉంది. అంతా అగమ్యం. ఈ లోకం ఏమైపోతుందా? అనిపిస్తుంది. ప్రకటన గ్రంథంలో లోకచరిత్ర గమ్యమేదో మనకు గోచరిస్తుంది. ప్రస్తుతం లోకపరిస్థితులను చూస్తూ ఉంటే సైతానుదే పైచేయి అనిపిస్తుంది గాని ప్రకటన గ్రంథ సారాంశం యేసే మహావిజేత. అంతిమ విజయం యేసుదే! ప్రభువైన యేసు మహా సింహాసనాసీనుడై కనిపిస్తాడు. ప్రకటన గ్రంథం నన్ను నిన్ను ఆశావాదులుగా మార్చేస్తుంది. యేసుకే పట్టాభిషేకం. ఇప్పుడు గెలిచినట్టు కనపడేది రేపు ఓటమిని చవిచూస్తుంది. ఇప్పుడు కింద ఉన్నది రేపు మహోన్నత పదవిని అలంకరిస్తుంది. దేవుని బిడ్డలదే అంతిమ విజయం. బైబిలు అంతటి అంతిమ ప్రకటనే ప్రకటన గ్రంథం. ప్రకటన గ్రంథాన్ని సమీకరించాలంటే ఎంతటి వారికైనా భయమేస్తుంది. అందలి సందేశము అంత గంభీరమైనది. బైబిలులో ప్రకటన 66వ గ్రంథం. మిగతా 65 గ్రంథాలు బాగా తెలిసిన వారికే ప్రకటన గ్రంథం అర్థమవుతుంది. లేకపోతే అపార్థానికి గురి అవుతుంది. ఆదికాండము మొదలుకొని యూదా పత్రిక వరకూ గ్రంథాల సారంశం మా పాఠకులకు తెలిసి ఉండాలి. బైబిలు గ్రంథంలోని ప్రతి పుస్తకంలో ఏముందో మా పాఠకులకు ముందుగా తెలిసి ఉండాలి.

### లోక పతనం

ఈ లోకంలోని ప్రతి వ్యవస్థ ప్రతి పరిపాలనా విధానం రాను రాను పనిచేయడం మానేస్తుంది. మానవునిలో విశ్వసనీయత బొత్తిగా లోపించింది. ప్రభుత్వం, రాజకీయాలు, విజ్ఞానశాస్త్రం, విద్య అన్ని రంగాలలో అపజయం. మానవ జీవితమేమి మరమ్మతు కావడం లేదు. రాను రాను లోకం చెడిపోతుందే గాని బాగుపడటం లేదు. వ్యాపార రంగమైతే మరీ దారుణంగా పరిణమిస్తుంది. ఈ కారుచీకటిలో ప్రకటన గ్రంథం మనకు గొప్ప కాంతి రేఖ. నాయకత్వం సంక్షోభంలో కూరుకు పోయింది. లోకంలో ప్రవర్తిల్లే ఈ అరచకానికి పరిష్కారం లేదా? ఉంది! అని చెబుతుంది ప్రకటన గ్రంథం.

ప్రియ పాఠకులారా ఇప్పుడు మనం చాలా గడ్డురోజుల్లో జీవిస్తున్నాము. సంఘచరిత్రలో కూడా ఈ రోజులు

చాలా చెడ్డవి అని మనకు చాలా సులభంగా తెలిసిపోతుంది. అణుధార్మిక కర్మాగారాల్లో పనిచేసేవారు అంటున్నారు "మాకు భయమేస్తుంది. రేపు ఏంజరుగుతుందో ఊహిస్తుంటే మాకు నిద్ర పట్టడంలేదు." పర్యాటక నిపుణులు అంటున్నారు. ఈ లోకం ఎటువైపు పోతున్నదో మనకు అర్థంకాదు. పరిస్థితులు మనలను తికమక పెడుతున్నాయి. పండితులు ఆందోళన చెందుతూ అంటున్నారు. ఇవి మానవ చరిత్రలో విషాదఘడియలు. ఆదర్శాలు పేకమేడల్లాగా కూలిపోతున్నాయి. దేవుడు ఈ లోకంమీద కఠినచర్య తీసుకుంటున్నాడు అనిపిస్తుంది. ఒక విశ్వవిద్యాలయ విజ్ఞానవేత్త అన్నాడు "ఆరేండ్ల వయస్సునుండి ఇరవైఒక్క సంవత్సరాల ఈడు వచ్చిన పిల్లలకు విధ్యాబుద్దులు నేర్పడం రానురాను కష్టతరం అవుతుంది." విద్యావిధానాలేవి సరిగా పనిచేయడంలేదు. ప్రయోగాలు విఫలమైపోతున్నాయి. వయోజన విధ్య ప్రయోజన విద్య అవుతుందేమో చూద్దామనుకుంటున్నారు. విద్యావేత్తలు ఎన్నో ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. కాలం మహా సంకుచితం అయిపోతుంది అంటున్నాడు చింతనాపరుడైన వేదాంతి. వెయ్యేండ్ల పరిపాలన వైపునకు అనేకుల దృష్టి ప్రసరిస్తుంది. అవిశ్వాసులు, అల్పవిశ్వాసులు ప్రకటన గ్రంథం విని భయభ్రాంతులవుతున్నారు. లోకం ముగింపు దశకు వచ్చేసింది. "క్రైస్తవులారా లోకాంతానికి ప్రజలను సిద్ధపరచండి" అని ఏదో అవ్యక్త స్వరం మనకు వినబడుతుంది. చరిత్రకారులు నేటి నాగరికత వివరిణామాన్ని గుర్తించి మానవత చరిత్రలో చివరి అధ్యాయం లోని చివరి పుటలివి అంటున్నారు. గోడమీద వ్రాత చదవగలవారు ఉంటే చదవండి. దేవుని తీర్పు దరిదాపుల్లోకి వచ్చింది అంటున్నారు. ఇవి చివరిరోజుల్లో చివరి రోజులు అంటున్నారు వేదాంతులు.

## వెయ్యేండ్ల పరిపాలన

ప్రకటన గ్రంథం విశ్వాసులకు దేవుని ప్రజలకు గొప్ప ఆదరణ గొలిపే గ్రంథం.

ప్రకటనగ్రంథం ప్రవచనాత్మకమైన ప్రత్యక్షం.

ప్రకటన గ్రంథం అంతా సంకేతాలు అని చెప్పి దాన్ని ఆధ్యాత్మీకరించే ప్రయత్నం చేయకండి. మహిమ పర్చబడిన క్రీస్తు ప్రత్యక్షం ఈ గ్రంథంలో ఉంది. సంఘ చరిత్ర అంతా ప్రకటన గ్రంథంలో ప్రత్యక్షపరచ బడింది. మూడో అధ్యాయం ముగియగానే సంఘం పరలోకానికి ఎక్కి వెళ్ళిపోతుంది. వెంటనే సంఘం యేసు పెండ్లి కుమార్తెగా ముస్తాబయి ఉంటుంది. క్రీస్తు దిగివచ్చి రాజ్యం స్థాపిస్తాడు. వెయ్యేండ్ల పరిపాలనను గురించి పరమాత్మజ్ఞానియైన యోహాను మనకెన్నో ఆసక్తి గొలిపే విషయాలను చూపిస్తాడు. అది పరీక్షాసమయం ఆ కాలం ముగిశాక సైతానుకు కొంతకాలం పాటు స్వేచ్ఛ ఇవ్వబడు తుంది. తిరుగుబాటు అణిచి వేయబడుతుంది. నిత్యత్వం ఆరంభ మవుతుంది. ఈ సంగతులు కన్నులకు కట్టినట్లు ప్రకటన గ్రంథం ప్రత్యక్ష పరుస్తుంది. కొందరు వెయ్యేండ్ల పాలన అయిపోయిందంటారు. అది భవిష్యత్తులో లేనే లేదంటారు. కొందరు అది జరుగుతున్నదంటారు. ఈ విధంగా పలువిధాలు అభిప్రాయాలున్నాయి. దేవుడు చెప్పని మాటలు ఆయన నోటిలో పెట్టడం అపచారం. వాక్యాన్ని మనం అంటిపెట్టుకొని ఉందాం. ప్రకటన గ్రంథ పాఠాలు మీ ఆత్మలకు ఎంతో వికాసము, ఉత్తేజం, ఉజ్జీవం కలిగిస్తాయి. లోకం రానురాను బాగుపడుతున్నది అనేది సైతాను చెప్పే అబద్ధం. లోకం బాగు పడదు, రానురాను చెడిపోతుంది. ప్రకటన గ్రంథం వింటూ ఉంటే మీకే అర్థమవుతుంది. యేసుక్రీస్తు రెండవసారి వస్తాడు అనే ప్రాతిపదిక వాస్తవాన్ని ఆధారం చేసుకొని మనం ప్రకటన గ్రంధాన్ని అధ్యయనం చేయాలి. యేసు వస్తాడు, పరిపాలిస్తాడు, మనమూ ఆయనతో పరిపాలిస్తాము. దేవుని రాజ్యం వస్తుంది. ఎప్పుడో తెలియదు. ఈ రోజుల్ను చూడండి. యేసురాజు వస్తాడని నమ్మండి. వెయ్యిసంవత్సరాలు యేసు శ్రేయోరాజ్యం కొనగుతుంది. యెరూషలేము రాజధానిగా వెయ్యేండ్ల పాలన మహావైభవంగా కొనసాగు తుంది. యేసుప్రభువు మత్తయి సువార్త 26వ అధ్యాయము 29వ వచనంలో అన్నాడు. నా తండ్రి రాజ్యములో మీతోకూడా నేను ఈ ద్రాక్షరసము క్రొత్తదిగా త్రాగే దినం వరకు ఇకను దానిని తాగనని మీతో నిశ్చయముగా చెబుతున్నాను. అదే రాబోయే వెయ్యేండ్ల రాజ్యం. యేసు వ్యక్తిగతంగా తిరిగి వచ్చి రాజ్యం స్థాపిస్తాడు. ఆయన రాజ్యం ఈ భూమి మీదకు రావాలి, వస్తుంది. యేసురాకడ బహు సమీపమై ఉంది. లేఖనములలో యేసు రాకడ, ఆయన రాజ్య సంస్థాపన స్పష్టముగా ప్రతిపాదించబడ్డాయి.

(మిగతా వచ్చే సంచికలో)

# ప్రార్థన వేదిక



1. డి.పి ఎలిజబెత్ రాణి - కడప
   పౌలు కంటి స్వస్థత కోసం
2. కె.నాగమ్మ - కర్నూలు
   ప్రియ చదువు, అనురాగ్ భవిష్యత్తు కోసం
3. కె.విమల - కొత్తవలస
   సుకుమార్ ఉద్యోగం కోసం
4. టి.మధుసూదనరావు - చేబ్రోలు
   ఆర్థిక సమస్యలనుండి విడుదల, పిల్లలు, కుటుంబం కోసం
5. ఆర్.రాజ్యలక్ష్మి - కంకిపాడు
   మోహనరావు వివాహం కోసం
6. పి.జ్ఞానసుందరి - ఖమ్మం
   పిల్లల చదువు, భర్త కాళ్ళనొప్పి స్వస్థత కోసం
7. యన్.అరుణకుమారి - గిద్దలూరు
   సంతానం కోసం
8. ఆర్.యన్.స్వామి - వరంగల్
   రావలిసిన డబ్బు వచ్చుట కోసం
9. జె.సురేంద్రకుమార్ - జంగారెడ్డిగూడెం
   కుమారుడు, మనుమడి కోసం
10. బి.కె.స్వామి - మంగళగిరి
    ఆర్థిక ఇబ్బందులనుండి విడుదల, రక్షణ కోసం
11. పి.రవికుమార్ - తాడిమళ్ళ
    జీవరత్నం గుండె ఆపరేషన్ సక్సెస్ కోసం
12. బి.ఆల్బర్ట్ రత్నస్వామి - గుత్తి
    పిల్లల ఉద్యోగం, చదువు కోసం
13. ఆర్.యల్.రావు - విశాఖపట్నం
    భార్య ఆరోగ్యం కోసం
14. జి.జయకుమారి - కడియం
    సంఘంలో విశ్వాసులు పెరగాలని, అభివృద్ధి కోసం
15. బి.ఆనంద్‌కుమార్ - హుబ్లీ
    తన సోదరుల వివాహాల కోసం
16. బి.వి.యన్.ప్రసాదు - ముదినేపల్లి
    అమ్మ, అత్తయ్య కుటుంబాల మారుమనస్సు కోసం
17. కె.ఫణిరాజు- రాజమండ్రి
    మనుమడు సుశీల్‌బాబు వివాహం కోసం
18. యస్.శారాబాయి - రాజమండ్రి
    రాజేష్‌కుమార్ మానసిక ఆరోగ్యం కోసం
19. బి.ఇమ్మానుయేలుబాబు - వాల్తేరు
    వివాహం కోసం
20. పి.సి.డబ్ల్యు.శేఖర్‌రాజు - విజయవాడ
    హెబ్సిబా స్వస్థత కోసం
21. దేవిడ్ బాలప్ప - గుత్తి
    ఆరోగ్యం కోసం
22. కె.ఎ.వినోద్‌కుమార్ - హైదరాబాదు
    వ్యాపారం, ఆరోగ్యం కోసం
23. బి.దేవభూషణం - గుత్తి
    మహితకుమారి ఉద్యోగం కోసం
24. జి.ఎలిజెబెతమ్మ - అనంతపూర్
    జాన్ విక్టర్ (10వతరగతి)చదువు కోసం
25. టి.దేవకుమారి - చౌటం
    సహోదరి అనూష ఆరోగ్యం కోసం
26. సి.హెచ్.విజయకుమారి - రాజమండ్రి
    కుమారుని చదువు, రక్షణ కోసం
27. జి.సుదర్శనం - పిఠాపురం
    సేవలో అభివృద్ధి కోసం
28. పి.మేరీ - ఇందిరానగర్
    ఇంటిపని పూర్తిఅగుట కోసం
29. ఆర్.సరోజిని - రాజోలు
    పిల్లలకు ఉద్యోగాలు, చిన్నపాప వివాహం కోసం
30. కె.క్రిస్టీనా - మహబూబ్‌నగర్
    నాన్న ఆరోగ్యం, చెల్లెళ్ళ, తమ్ముళ్ళ వివాహాల కోసం

## మెదడుకు మేత

# ప్రకటన గ్రంథములోని 7సంఖ్య గల వాని పేర్లు 25

కూర్పు - పాస్టర్ పి.ప్రతాప్ కుమార్

| | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ము | క | లు | ది | కొం | న | లు | వి | దీ | ట | ము | త్ర | క | లు |
| ప | లే | మి | ము | తొ | డ | మై | ద్ర | పా | న్ను | క్రొ | క్ష | ము | క్రొ |
| లు | రో | ష | క | ప | న | లు | త్త | ము | త్త | డ | ఘ | త్త | వ |
| త్మ | లు | స్వ | రూ | నూ | దీ | క్రొ | ట | పే | భూ | సం | ఆ | దే | త |
| ఆ | వి | ము | బూ | యె | స్త | త్తా | రు | ము | డు | కా | లు | రు | ఉ |
| క | లో | న | రు | ఫా | న | ము | రీ | యే | శ | త్మ | కొ | ల | ము |
| లి | న్ను | గ | మై | ఉ | లు | త | భ | ము | రు | ము | యే | మ్ము | త |
| లు | ళ్ళ | లు | దా | న | రి | క్రొ | నూ | స్తం | తె | పే | ట | సం | లు |
| వే | కె | గు | త్త | పే | త | లు | మి | దూ | ప | ళ్ళ | త్త | రీ | నూ |
| డు | కొ | బూ | తె | లు | భ | నూ | త్ర | భూ | లు | దీ | వ | క్రొ | కి |
| ఏ | ర | రీ | త | రి | ము | ధ్ర | ము | పా | త్త | దే | ర్ణ | కొ | నా |
| లు | మ | దూ | రా | ణ | వ | త్ర | ము | స్త | రు | క్రొ | కా | వ | స |
| పా | వ | ణ | ణా | జు | రు | డ | క్ష | వ | మ | గా | వే | ము | సు |
| దే | ప | ర | ర | క్రో | లు | ము | క | న | పే | స | బం | లు | ఆ |

1.యేడు సంఘములు (1:4)
2.ఆత్మలు (1:4)
3.సువర్ణ దీపస్తంభము (1:12)
4.నక్షత్రములు (3:1)
5.దీపములు (4:5)
6.ముద్రలు (5:1)
7.కొమ్ములు (5:6)
8.కన్నులు (5:6)
9.దేవదూతలు (8:2, 17:1)
10.బూరలు (8:2)
11.ఉరుములు (10:4)
12.ఏడువేలు (10:13)
13.సమస్తము నూతనమైనవి (21:5)
14.తలలు (12:3)
15.కిరీటము (12:3)
16.కడవరి తెగుళ్ళు (15:1)
17.బంగారు పాత్రలు (15:7)
18.కొండలు (17:9)
19.రాజులు (17:10)
20.క్రొత్తపేరు(2:17)
21.నాక్రొత్తపేరు (3:17)
22.నూతన యెరూషలేము (3:12)
23.క్రొత్తపాట (5:9)
24.క్రొత్త ఆకాశము (21:1)
25.క్రొత్త భూమి (21:1)

**సూచనలు:**

1. స్పందనలో ప్రింట్ చేసిన గ.ను.క. లోనే పంపాలి. వేరుగా పంపినవి స్వీకరింపబడవు.

2. పూర్తిచేసిన గ.ను.క. లు ఆగస్టు 20లోపు, ఇతర రాష్ట్రాలవారు పత్రిక అందిన వారంలోగా మాకందేటట్లు పంపాలి.

పూర్తి చేసి పంపిన వారి పేరు.........................

స్పందన కోడ్ నంబరు ...............................

## అడ్డం

1. మన నాలుక ‒ ‒ ‒ ‒ ‒ ‒ తో నిండియుండెను. (కీర్తనలు100-150)
4. నా సేవకుడైన నయమానునకు కలిగిన కుష్ఠరోగమును నీవు బాగు చేయవలెనని యీ ‒ ‒ ‒ ను అతని చేత పంపియున్నాను. (2రాజులు)
6. పాతదైన పులి ‒ ‒ ‒ నైనను... (కొరింధి)
7. గ్రుడ్డివాడైన బర్తీమయి తండ్రి ‒ ‒ ‒ ‒ (మార్కు)
10. నిశ్చయముగా నేను వారి యెడల జాలిపడి ‒ ‒ లో నుండి వారిని రప్పించెదను. (యిర్మియా)
11. నీ సన్నిధిని ‒ ‒ ‒ నన్ను నిలువబెట్టుము. (కీర్తనలు 1-50) (తలక్రిందులు)
13. ‒ ‒ ‒ ‒ బూరలు ఊదగా ప్రజలు కేకలు వేసిరి... ప్రాకారము కూలెను. (యెహోషువా)
15. రాళ్ళతో కొట్టబడిరి, ‒ ‒ ములతో కోయబడిరి, శోధింపబడిరి, ఖడ్గముతో చంపబడిరి. హెబ్రీ పత్రికలోని విశ్వాసయోధులు.
16. ప్రమాణమును బట్టి జలములకు ఇంత ‒ ‒ ‒ యని ఆయన వాటిని కొలిచి... (యోబు)
18. మనము ఏకమైయున్నలాగున, వారును ఏకమై యుండవలెనని నీవునాకు అనుగ్రహించిన ‒ ‒ ‒ ను నేను వారికి ఇచ్చితిని. (యోహాను)
19. యెహోవా కోపము ఇశ్రాయేలీయుల మీద ‒ ‒ ‒ ‒ ‒ ‒ ఆయన దావీదును వారి మీదకు(లెక్కించుటకు) ప్రేరేపణచేసెను. (2 సమూయేలు)
22. యాపెతు మనుమలలో ఒకడు ‒ ‒ ‒ (ఆదికాండము)
23. పదియవ వంతులను పుచ్చుకొను లేవియు అబ్రాహాము ద్వారా ‒ ‒ ‒ ‒ ‒ లను ఇచ్చెను. (హెబ్రీ)

## నిలువు

1. వారు నిందారహితులై యుండునట్లు ఈలాగు ‒ ‒ ‒ ‒ ‒ (తిమెతి)
2. పవిత్రతతోనూ, జ్ఞానముతోను, దీర్ఘశాంతముతోను, ‒ ‒ ‒ ను,... నిష్కపటమైన ప్రేమతోను.. 2కొరింథీ

## ఆగస్టు గళ్ళ నుడి కట్టు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | ⊗ | 4 | | 5 |
| | ⊗ | | ⊗ | | ⊗ | ⊗ | | ⊗ | |
| 6 | | | ⊗ | 7 | | 8 | ⊗ | 9 | |
| | ⊗ | ⊗ | 10 | | ⊗ | | ⊗ | | ⊗ |
| 11 | | 12 | ⊗ | | ⊗ | 13 | | | 14 |
| ⊗ | ⊗ | 15 | | ⊗ | ⊗ | ⊗ | ⊗ | ⊗ | |
| 16 | | | ⊗ | 17 | ⊗ | 18 | | | ⊗ |
| | ⊗ | 19 | | | | | ⊗ | ⊗ | 20 |
| | ⊗ | | ⊗ | | ⊗ | ⊗ | 21 | | |
| ⊗ | ⊗ | ⊗ | 22 | | | | | ⊗ | |

3. నేను తిరిగిరాగా ‒ ‒ ‒ ‒ ‒ న ఇరుప్రక్కన చెట్లు విస్తారముగ కనబడెను. (యెహెజ్కెలు)
4. నీ ‒ ‒ పిల్లలను పట్టుకొని వారిని బండకు వేసి కొట్టువాడు ధన్యుడు. (కీర్తనలు 100-150)
5. జ్ఞానముగలవానిని ‒ ‒ ‒ వాడు వానివలన ఆనందమునొందును. సామెతలు
8. యాజకుడైన హిల్కీయా కుమారుడు ‒ ‒ ‒ (యిర్మీయా)
9. ఓడ చులకన చేయుటకై అందులోని ‒ ‒ ‒ లను సముద్రములో పారవేసిరి. (యోనా)
12. ‒ ‒ ‒ ‒ ‒ ‒ నా నామము ఇదే, తరతరములకు ఇది నా జ్ఞాపకార్థక నామము. (నిర్గమకాండము)
14. పక్షవాయువు కలిగిన ఐనేయ నివాసగ్రామము. ‒ ‒ (అ.కార్యములు)
16. అకుల, ప్రిస్కిల్ల అనవారి పట్టణము ‒ ‒ ‒
17. సిరాయారాజు సైన్యము రాత్రివేళ వచ్చి ‒ ‒ ‒ ‒ లను (దోతాను) పట్టణమును చుట్టుకొనగా...(2రాజులు)
18. క్రీస్తు మిమ్మును ప్రేమించి పరిమళ వాసనగా ఉండుటకు ‒ ‒ కొరకు తన్నుతాను దేవునికి అర్పణముగాను బలిగాను అప్పగించుకొనెను. (ఎఫెసీ)
20. ఇశ్రాయేలీయులలో ఎవనినైనను సొలొమోను దాసునిగా చేయక వారిని... అధిపతులుగాను, ‒ ‒ ‒ గాను ఉంచియున్నాడు. (1రాజులు)
21. మీకాలు పెనిమిటి బహూరు ‒ ‒ వరకు మీకాలు వెనుక ఏడ్చుచూ వచ్చెను. (2సమూయేలు)

తప్పక చూడండి

# స్పందన టి.వి. కార్యక్రమాలు

| శుభవార్త ఛానెల్‌లో | ఆరాధన ఛానెల్‌లో | బైబిల్ టి.వి. ఛానెల్‌లో | విజయవాడ - సువార్త ఛానెల్లో |
|---|---|---|---|
| బుధవారం | శనివారం | మంగళవారం | సోమ-శుక్రవారం వరకు |
| రాత్రి 8:30 గం॥లకు | రాత్రి 10 గం॥లకు | ఉదయం 8:30 గం॥లకు | రాత్రి 9 గం॥లకు |

వీనుల విందైన సంగీతం
ఆశీర్వాదం కలిగించే ఆత్మపూర్ణ సందేశాలు
మీ కుటుంబం కోసం ప్రత్యేక ప్రార్ధనలు
'అడిగారు కాబట్టి' మీ ప్రశ్నలకు జవాబులు
వార్తలు - వాఖ్యలు 'మారిన జీవితాలు' సజీవ సాక్ష్యాలు



**ఆచార్య ఆరార్కేమూర్తి గారు డా. దేవసహాయం గారు**
**ప్రసంగించి మీ కొరకు ప్రార్ధిస్తారు.**

ఒక్కో కార్యక్రమానికి సుమారుగా 10 వేల రూపాయలు ఖర్చవుతుంది. ప్రభువు మిమ్ములను ప్రేరేపిస్తే మీ సేవా కానుకలు పంపి సహకరించండి.

స్పందన, ఇ.యస్.ఐ.హాస్పటల్ రోడ్, గుణదల, విజయవాడ - 520 004

# లిటిల్ ఏంజల్స్ హోమ్



అనాధ, పేద పిల్లల ఆశ్రమము

చిన్న పిల్లలను ఆటంకపరచ వద్దు. దేవుని రాజ్యము ఇలాంటి వారిదే (బైబిలు)



వివరాలకు:
డా॥ దేవ
లిటిల్ ఏంజల్స్ హోమ్
ఇ.యస్.ఐ.హాస్పటల్ రోడ్, గుణదల, విజయవాడ-4
ఫోన్ : (0866) 2456547, 9490113300

గమనిక : చెక్కులు, డ్రాఫ్టులు పంపించేవారు SPANDANA పేరు మీద పంపించ మనవి

RNI No: 32106/76 Regd No. VJ/057/2009-11
Licenced to post without pre-payment No. PMG/VJ/PWPP/21/2009-11

# దేశం కోసం ప్రార్థన

**భూమ్యాకాశాలకు దేవా!**

ఒక్క మనిషినుండి అనేక జాతులను, భాషలను మాట్లాడేవారిని సృజించినవాడా!
అనంతమైన మీ జ్ఞానం కోసం మిమ్మును స్తుతిస్తూ, ఆరాధిస్తున్నాము.
భారతదేశ పౌరసత్వాన్ని జన్మతహః మాకిచ్చినందుకు మీకు స్తోత్రాలు.

**సృష్టికికర్తవైన దేవా!**

మా నేలమీదున్న అనేక జాతులు, వివిధ భాషలు, విభిన్న సంస్కృతుల కోసం మీకు స్తుతులు
సహజసిద్ధమైన శ్రేష్ఠ వనరులు- నీరు, సత్తువగల భూమి, ఖనిజాలన్నిటి కోసం మీకు వందనాలు
పరాయి పాలననుండి మా కిచ్చిన విముక్తి కోసం, స్వాతంత్ర్యం కోసం మిమ్మును పూజిస్తున్నాము.
ప్రభూ! ఇందు కోసం ప్రాణాలర్పించిన ప్రతి ఒక్కరికోసం మీకు వందనాలు.

**సైన్యాలకధిపతీ, ప్రభూ!**

మా దేశ పాలకుల కోసం ప్రార్ధిస్తున్నాము. వారు నిస్వార్ధంతో, నిష్పక్షపాతంగా, అవినీతి లేకుండా,
సత్యంతో దేశాన్ని పాలించటానికి వారిని మీ చేతుల్లో ఉంచుతూ, ప్రార్ధిస్తున్నాము.
మా దేశ శాంతికి భంగం కలిగించే సమస్త కీడులు నాశనమగు గాక!
ఒకరిని ఒకరు గౌరవిస్తూ ప్రజలందరూ మా దేశ చట్టాలకు లోబడుదురు గాక!
మా దేశంలోని ధనవంతుల్లో దయాగుణం వర్ధిల్లి బీదలను, అనాధలను ఆదుకొందురు గాక!

**ఆకాశ మహాకాశాల నిర్మాణకుడా!**

మా భూమి కరువు కాటకాల బారిన పడకుండా సకాలంలో వర్షాలు పంపించండి.
పేదలు, అణగారిన ప్రజానీకం, దిక్కులేనివారు, అనాధలకోసం ప్రయాసపడుతూ
పనిచేస్తోన్న వ్యక్తులమీద, సంస్థల మీద మీ ప్రత్యేక దీవెనల కోసం ప్రార్ధిస్తున్నాము. సహాయార్ధం అభివృద్ది
చెందిన దేశాలనుండి వస్తోన్న విరాళాలు, వనరులు దుర్వినియోగం కాకూడదని ప్రార్ధిస్తున్నాము.
కనీస అవసరాలు తీరక బాధపడుతోన్న కోట్లాది భారతీయులను కనికరించండి ప్రభూ!



మీ కుమారుని పండ్రెండుగురు శిష్యులలో ఒకడైన తోమాను మొదటి
శతాబ్దంలోనే మా దేశానికి పంపినందుకు మీ స్తుతిని కీర్తిస్తున్నాము.
ఈ తరంలోనే సువార్తనుగురించిన మీ గొప్ప ఆజ్ఞను నెరవేర్చటానికి మా
దేశంలోని సంఘమును నిద్రామత్తునుండి లేవనెత్తండి,
చైతన్య పరచండి!
ఆమెన్, ఆమెన్!

spandana offset, vja. cell:94402 80158